జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
ఆదివారం | 30 | మార్చి | 2025 ◆ పేజీలు : 11

# నేడే యుగాది



- నేటి నుండే శ్రీ విశ్వావసు నామ సంవత్సరం యుగాది తెలుగు సంవత్సరం ప్రారంభం

**జగిత్యాల, మార్చి 29, (ప్రజాజ్యోతి):** యుగ + ఆది = యుగాది.......!! భాషాపరంగా యుగాది సరైన పదం. ఉగాది అనే పదం వికృతిపదం. అయితే రెండూ ఒకే అర్థాన్ని బోధించే పదాలే. సోమకాసురుని నుండి వేదాలను విష్ణువు రక్షించిన రోజు ఉగాది. నూతన కల్పంలో జగత్తు సృష్టిని బ్రహ్మ ప్రారంభించిన రోజు. ఆరు రుచుల కలయికతో అనారోగ్యాలను అంతం చేసేది ఉగాది. హిందువుల పండుగల సంప్ర దాయానికి మొదలు ఉగాది. వరాహమిహిరుడు ఈ ఉగాది నాడే

మిగతా 2 లో...

- వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు
- అతి త్వరలోనే పార్లమెంట్ ఆమోదించడం తథ్యం
- మజ్లిస్ దేశద్రోహ పార్టీ
- మతం కోణంలో అడ్డుకుంటే ప్రజలే తిర గబడతారు
- దేశం కోసం కఠిన నిర్ణయాలు తీసు కునేందుకు వెనుకాడబోం
- దేశ ప్రజలను,ఆస్తి పాస్తులను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది
- కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్....
- కరీంనగర్ లో బండి సంజయ్ ను సన్మానించిన న్యాయవాదులు
- న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాలు కోసం రూ.50 లక్ష లిస్తానని హామీ



## మజ్లిస్ పార్టీయే అసలైన...

# దేశద్రోహ పార్టీ

**కరీంనగర్ బ్యూరో, మార్చి 29, (ప్రజాజ్యోతి):** భారత రాజ్యాంగానికి భవిష్యత్ లో ఆర్ ఎస్ఎస్ భావజాలం తోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు పై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. ఒవైసీసహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్ లో అతి త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశం ప్రజల కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు వెను కాడబోదని ఉద్ఘాటించారు.శనివారం కరీంనగర్ లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్

మిగతా 2 లో...



## తెలంగాణ ఇచ్చిన పార్టీగానే కాదు...

# అభివృద్ధి చేసేది కాంగ్రెస్సే..

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- రామగిరిలో సమీకృత ప్రభుత్వ భవనం నిర్మాణానికి నిర్ణయం
- ఇందిరమ్మ ఇండ్లు నిరు పేదలకే మొదటి ప్రాధాన్యత
- అభివృద్ధిలో పారి శ్రామికత ముఖ్య భూమిక

**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఇచ్చిన పార్టీ మాత్రమే కాదు, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది కాంగ్రెస్ పార్టీ నేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగానే మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పునాదులను మరింత బలంగా ఏర్పాటు చేసేందుకు మంత్రి దుద్దిళ్ళ.శ్రీధర్ బాబు ప్రతిష్టాత్మక ప్రణాళికలను రూపొందించారు. శనివారం రామగిరి

మిగతా 2 లో...

## జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమం ప్రారంభం

- సంవిధానం రక్షణకు కార్య కర్తలతో ప్రతిజ్ఞ
- 312 మందికి రూ.3కోట్ల 10 లక్షల 2 వేలు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ
- ఏఐసీసీ, టీ పీ సీ సీ ప్రతినిధులు హాజరు



**జగిత్యాల టౌన్,మార్చి 29, (ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జిల్లా కాంగ్రెస్ ఆద్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిదాన్ జగిత్యాల జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు . భారత రాజ్యంగాన్నీ రక్షించాలని, అంబేద్కర్ కల్పించిన హక్కుల ను కాపాడాలని జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపట్టింది. జిల్లా పరిశీలకులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీ పీసీసీ ప్రతినిధి అవేజ్, రుద్ర సంతోష్ హాజరయ్యారు సంవిధాన రక్షణ కోసం, హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, కార్యకర్తలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమ నిర్వహణను వివరించారు.జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన తీసుకెళ్ళాలని సూచించారు భారత సంవిధాన రక్షణ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు నాలుగు దశాబ్దాలుగా ప్రజల గొంతుకగా

మిగతా 2 లో...

## షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల

# అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం నిబంధనల ప్రకారం సకాలంలో అందించాలి
- సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి 29, (ప్రజాజ్యోతి):** జిల్లాలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం రాష్ట్ర

మిగతా 2 లో...

## షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు





(మొదటి పేజీ తరువాయి...)

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ , డిసిపి , ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ కే లక్ష్మీనారాయణ, కుత్రం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్ లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. పెద్దపల్లి జిల్లాకు వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ , సభ్యులను అదనపు కలెక్టర్ సాదరంగా స్వాగతించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ఎస్సీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అదనపు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులు శిక్ష వచ్చేలా సాక్ష్యాలను ప్రవేశ పెట్టాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ కేసులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కొరకు తహసిల్దార్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ఎస్సీ ఎస్టీలకు 100% పని దినాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా పని ప్రదేశాలలో చల్లని త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ శాఖలలో ఎస్సీ ఎస్టీ అధికారులకు రోస్టర్ పాయింట్ ప్రకారం పదోన్నతులు సజావుగా పారదర్శకంగా వచ్చేలా వ్యవహరించాలని కోరారు. ఎస్సీలు హత్యకు గురికాబడితే చట్టం ప్రకారం వారి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పెన్షన్, భూమి మంజూరు చేయాలని అన్నారు. గత 5సంవత్సరాలుగా ఎస్సీ హత్య కేసుల్లో అందించిన పరిహార వివరాలు అందించాలని, నెల రోజుల వ్యవధిలో పెండింగ్ పరిహారం, ఉద్యోగం పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని, అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ,సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, పెద్దపల్లి, గోదావరిఖని ఏ.సి.పిలు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమం ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి...)

నిలిచానని, పార్టీ నీ బలోపేతం చేయడంలో కృషి చేశానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ భారత సంవిధాన రక్షణ అందరి బాధ్యత అని అన్నారు.ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కత్తి వెంకట స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సేవలు రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీ కి అవసరమని, అధిష్టానం దృష్టికి సైతం తీసుకెల్లామని అన్నారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 312 మందికి రూ.3కోట్ల 10 లక్షల 2 వేలు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

# మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ

(మొదటి పేజీ తరువాయి...)

రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్ కుమార్, కార్యదర్శి బేతి మహేందర్,బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు తదితరులు హాజరై ప్రసంగించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి కేసులు ఎదుర్కొన్న. 109 కేసులు నాపై ఉన్నాయి. పలుమార్లు జైలుకు పోయిన. ప్రతిసారి నన్ను కాపాడుతోంది న్యాయవాదులే. వారి సంక్షేమం కోసం అన్ని విధాలా సహకరిస్తానాని. న్యాయవాదుల కాన్ఫరెన్స్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుండి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు నావంతు క్రుషి చేస్తానన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు పై మజ్లిస్ నేత ఒవైసీ అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. దేశమంతా వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు పలుకుతున్నరు. ఒవైసీలాంటి ఎంత మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు. పార్లమెంట్ లో ఆమోదించి తీరుతాం. ఈ దేశ ప్రజల ఆస్తిపాస్తులు కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నాం. దేశమంతా తిరిగి అభిప్రాయాలను సేకరించాం. పార్లమెంట్ సంఘం సమావేశమై నివేదిక కూడా సమర్పించింది. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడం తథ్యం. మతం కోణంలో ఆలోచించి దీనిని అడ్డుకోవడం సరికాదు. అలాంటి వారిపై ప్రజలు తిరగబడే ప్రమాదం ఉంది. వక్ఫ్ బోర్డు పేరు తీరుతో పేదలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో నాకు తెలుసు. ఈ కరీంనగర్ లోనే ఓ పేద వ్యక్తి తరతరాల నుండి ఇంటిని నిర్మించుకున్నరు. వాళ్ల తాత, ముత్తాతలు ఆ ఇంట్లోనే ఉంటున్నారు. కానీ వక్ఫ్ బోర్డు స్థలమని చెప్పి అనుమతులన్నీ రద్దు చేసి ఇబ్బంది పాల్జేశారు. ఇలాంటివి దేశవ్యాప్తంగా ఉన్నాయి. అందుకే దేశ ప్రజలను, ఆస్తిపాస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సవరణ బిల్లు రూపొందించాం. దీనిని మతం కోణంలో చూపి రెచ్చగొట్టాలని కుహానా లౌకిక వాదులు చూస్తున్నారు. ఒవైసీ సహా కుహానా లౌకిక వాదులు ఎవరు అడ్డుకున్నా ఈ బిల్లు ఆగదన్నారు. దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

# తెలంగాణ ఇచ్చిన పార్టీగానే కాదు - అభివృద్ధి చేసేది కాంగ్రెస్సే..

(మొదటి పేజీ తరువాయి...)

మండల కేంద్రంలో సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షిస్తున్నారు. ప్రజలకు పరిపాలనా సేవలు వేగంగా అందుబాటులోకి రావడం, ప్రభుత్వ పనితీరు మరింత మెరుగుపడటం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష, మంథని ఆర్డీఓ సురేష్, ఆర్జీ-3 ఏరియా జీఎం నరేంద్ర. సుధాకర్ రావు లతో కలిసి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి దుద్దిళ్ళ.శ్రీధర్ బాబు మండల కేంద్రంలోని వారసంత ప్రాంగణం అనుకొని నిర్మించనున్న 65 లక్షల రూపాయలతో తాసిల్దార్ కార్యాలయాన్ని నిర్మించాల్సిన ప్రణాళికను విస్తరించి, అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట అందించే సమీకృత భవనంగా మారుస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటన, ప్రజలకు సౌకర్యాల్ని అందించేందుకు ఆయన తీసుకున్న నిర్ణయం నిజమైన అభివృద్ధి సంకల్పానికి నిదర్శనం" అని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

**అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం :**

తెలంగాణ ఇచ్చిన పార్టీగా మాత్రమే కాదు, రాష్ట్రాన్ని సర్వతో ముఖంగా అభివృద్ధి చేసే పార్టీగా కాంగ్రెస్ నిలుస్తుందని, నీళ్లు, నిధులు, నియామకాలు, అభివృద్ధి, సంక్షేమం అన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని మంత్ర శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వం లాగ అవాస్తవ ప్రచారాలు కాదు, ప్రజలకు స్పష్టమైన అభివృద్ధిని చేసి చూపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గత బీఆర్ ఎస్ పరిపాలన హయాంలో అభివృద్ధి సంకల్పం లేక పోవడంతో అనేక ప్రాజెక్టులు ముందుకు సాగలేదని, ధరణి లాంటి వ్యవస్థ వల్ల రైతులు, భూముల యజమానులు నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు భూభారతి ద్వారా భూ సంస్కరణలను తెస్తూ, భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తోందనీ పేర్కొన్నారు. బీఆర్ ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాగా, ఇప్పుడు ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలకు పరిపాలనా సేవలు వేగంగా అందుబాటులోకి రావడం, ప్రభుత్వ పనితీరు మరింత మెరుగుపడటం లక్ష్యంగా ప్రభుత్వ శాఖలన్నింటిని ఒకే భవనంలో ఉండేలా, మండల స్థాయి సమీకృత ప్రభుత్వ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, మండల పరిషత్, విద్యా, వ్యవసాయం, విద్యుత్, ఈజీఎస్, మండల సమాఖ్య మండలి కార్యాలయాలు ఒకే భవనంలోకి రావడం వల్ల ప్రజలకు వేగవంతంగా ప్రభుత్వ సేవలు అందుతాయన్నారు.



**నిరుపేదల సంక్షేమమే లక్ష్యం**

ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఆశాజ్యోతి అనీ, నిస్వార్థ సేవా భావంతో ఈ పథకాన్ని విజయవంతం చేయాలనీ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలనీ అధికారులకు ఆయన సూచించారు. నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత కల్పించాలని. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పథకం అమలులో పారదర్శకతను పాటించాలని సూచించారు. అన్ని అర్హతలు ఉన్న ఏ ఒక్క నిరుపేదకూ అన్యాయం జరగకూడదని, ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి. సుమన్, ఎంపీడీఓ బద్రి. శైలజా రాణి, నా యిబ్ తాసిల్దార్ మానస, ఎంపీఓ ఉమేష్, పిఆర్ ఏఈ కావ్య, గ్రామ కార్యదర్శి భూక్యా ప్రేమలత, రెవెన్యూ ఆర్ఐ మహేష్, జూనియర్ అసిస్టెంట్ యస్వంత్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల.తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆరెల్లి.దేవక కొమురయ్య గౌడ్, కోరకొప్పుల నీరజా తులసీరాం గౌడ్, మాజీ జెడ్పిటిసిలు మైదం భారతి వరప్రసాద్, నాగినేని జగన్మోహన్ రావు, ఏల్లె శశిరేఖ రామ్మూర్తి, మాజీ సర్పంచులు తీగల సమ్మయ్య దేవునూరి రజిత శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు చిందం.మహేష్, రెండ్ల.సందీప్, కొప్పుల గణపతి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికత ముఖ్యమైన భాగం :**

రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికత ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి అడ్డుగా నిలిచే ప్రయత్నాలను తిప్పికొడతామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రజల న్యాయమైన హక్కులను రక్షిస్తూ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ పరిశ్రమల రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందనీ, కొత్త పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి వంటి అంశాల్లో స్పష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. రత్నపూర్ లో పరిశ్రమ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందనీ, ఈ అవకాశాన్ని కోల్పోకుండా, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సహకరించాలని" మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

# పోటాపోటీగా సుందరగిరి వారసంత వేలం..

- వేలంపాటలో పాల్గొన్న 34మంది
- ప్రభుత్వం వేలంపాట 3లక్షల 33వేల 3వందలు నుండి మొదలు
- 7లక్షలకు వారసంతను కైవసం చేసుకున్న పరకాలకు చెందిన పోరండ్ల రమేష్

**చిగురుమామిడి మార్చి 29(ప్రజా జ్యోతి) :**కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గొర్రెల,మేకల వారసంత టెండర్ ను చిగురుమామిడి తహసిల్దార్, సుందరగిరి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ముద్దసాని రమేష్ సమక్షంలో గ్రామపంచాయతీ ఆవరణంలో శనివారం బహిరంగ వేలంను నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో 34మంది ఒక్కొక్కరు 20వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన 3లక్షల 33వేల 3వందల నుండి మొదలైన వేలంపాట పోటాపోటీగా ఎవరు ఊహించని విధంగా 7లక్షలకు చేరుకుంది.పరకాలకు చెందిన పోరండ్ల రమేష్ 7లక్షలకు వారసంతను సంవత్సరం పాటు కైవాసం చేసుకున్నారు.ఒక పశువుకు విక్ర యిదారుల నుండి వంద రూపాయలు మాత్రమే తీసుకోవాలని అధికారులు సమావేశంలో వెల్లడించారు. వారసంత నిర్వహించే చోట లైట్స్ సౌకర్యం,త్రాగు



నీరు సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించాలని, వారసంతకు వచ్చేవరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరారు.హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.వారసంత వేలంపాటను కైవాసం చేసుకున్న రమేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,ఎంపీఓ రాజశేఖర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్, తాజామాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పండుగకు సిద్ధమైన శ్రీ మహాశక్తి దేవాలయం.

- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు పూర్తి
- పంచాంగ శ్రవణానికి హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, మార్చి 29, (ప్రజాజ్యోతి)** కరీంనగర్ పట్టణం చైతన్య పురిలోని మహిమాన్విత శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలకు సిద్ధమైంది. తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను పురస్కరించుకొని శ్రీ మహాశక్తి దేవాలయానికి కరీంనగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి తరలివచ్చే అశేష భక్తులకు కనువిందు చేసేలా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణతో పాటు దేవాలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులతో ఆదివారం రోజున ఉగాది పండుగను పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 4:30 గం.లకు శ్రీ మహాదుర్గ,శ్రీ మహాలక్ష్మి,శ్రీ మహా సరస్వతి అమ్మవార్లకు అభిషేకం అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టనున్నారు. ఉదయం 7 గంటలకు ఉగాది పచ్చడి వితరణ, సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవాలయంలో జరుగునున్న పంచాంగ శ్రవణ కార్యక్రమానికి కేంద్ర మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా విచ్చేస్తున్న ఉగాది (తెలుగు నూతన సంవత్సరం) విశ్వావసు నామ సంవత్సరంలో దేవాలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సమస్త హిందూ బంధువులంతా పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

## ఉగాది పండుగ ప్రజలందరికీ సుఖ సంతోషాలు పంచాలి

- అన్ని రంగాల్లో శుభం కలగాలి
- శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో తెలంగాణ మరింత గొప్పగా
- అభివృద్ధి చెందాలి..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ
- ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు
- ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు..



**కరీంనగర్ బ్యూరో, మార్చి 29, (ప్రజాజ్యోతి) :**తెలుగు నూతన సంవత్సరం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ ప్రజలందరికీ సుఖ సంతోషాలు పంచాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆకాంక్షించారు. ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలందరికీ రాజేందర్ రావు శుభాకాంక్షలు తెలిపారు.శనివారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఉగాది ప్రజలంతా సంతోషంగా, ఆనందం గా జరుపుకునే పండుగని, కొత్త సంవత్సరం మన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లో శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాలను పంచుతుందని తెలిపారు. తెలుగు సంవత్సరం ప్రారంభమయ్యే ఈ ఉగాది మనందరికీ ఎంతో ప్రత్యేకమైనదని, ఈ వేడుకను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. కొత్త చిగురులు వేసే వసంత రుతువు మొదలయ్యేదీ ఈ పర్వదినం నుంచేనని తెలిపారు.వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది.. రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చనున్నదని రాజేందర్ రావు చెప్పారు. సాగునీరు, తాగునీరు, పచ్చని పంటలతో తెలంగాణ లో నిత్య వసంతం నెలకొన్న దని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా దాని అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచింద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రం మరింత గొప్పగా అభివృద్ధి సాధిస్తుందని రాజేందర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. మరోసారి ప్రజలందరికీ రాజేందర్ రావు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## మెడికల్ కార్డుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి) :**సింగరేణి సంస్థలో వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన కాంట్రిబ్యూటరీ పోస్ట్-రిటైర్మెంట్ మెడికేర్ స్కీం (CPRMSE)లో సభ్యత్వం కోసం దరఖాస్తు గడువు ఏప్రిల్ 15 వరకు పొడగించినట్లు రామగుండం-3 ఏరియా పర్సనల్ విభాగాధిపతి బి. సుదర్శనం తెలిపారు. అభ్యర్థులు తమ సంబంధిత గని లేదా విభాగాన్ని సంప్రదించి దరఖాస్తు సమర్పించాల్సిందిగా ఆయన సూచించారు. ఈ స్కీంలో సభ్యత్వం పొందేందుకు 60,000 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## సన్న బియ్యం పంపిణీతో నిరుపేదల్లో సంతోషం

- మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరీ మహేష్



**చొప్పదండి, మార్చి 29 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో వారిలో సంతోషం తాండవిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు. ఆదివారం నుండి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేసే సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీలను నెరవేర్చడంతో పాటు గ్యారంటీలలో లేని పథకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పకుండానే దీనిని ప్రస్తుతం అమలు చేయడం వల్ల అందరూ మనసుల్లో ఆనందం నిండుకుంటుందని అన్నారు. గతంలో పౌరసరఫరాల శాఖ నుండి నిరుపేదలకు ఇచ్చిన బియ్యము దొడ్డుగా ఉండడము పురుగులు ఉండడం తో ఆ బియ్యాన్నినిరుపేదలు తినలేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో అంగన్వాడి సెంటర్లలో అందజేస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలకు అందివ్వాలనే సంకల్పంతోనే సన్నబియాల్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ బియ్యం తీసుకున్న పేదలు ప్రతి ఒక్కరూ కడుపునిండా భోజనం చేస్తారని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డికి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ తై బజార్ వేలం పాట వాయిదా



**సుల్తానాబాద్ మార్చి 29 (ప్రజా జ్యోతి)** మున్సిపల్ తై బజార్ వేలం పాట వాయిదా పడినట్లు కమిషనర్ మహ్మద్ నియాజ్ తెలిపారు. 2025-26 సంవత్సరమునకు గాను నిర్వహించిన వేలం పాట వాయిదా వేసామని శనివారం మున్సిపల్ కార్యాలయం లో తైబజార్ కు గవర్నమెంట్ ధర 10 లక్షల రూపాయలు నిర్ణయించగా 27వ తేదిన నిర్వహించిన వే లములో పాల్గొన్న డిపాజిట్ దారులు 03 లక్షల 25000 రూపాయల వరకు వేలం పాట పాదగా ,మరల తేది.29న నిర్వహించిన వెలములో డిపాజిట్ దారులు 04 లక్షలు పాట పాడగా తైబజార్ వేలం పాటను వాయిదా వేసినట్లు కమీషనర్ తెలిపారు. తిరిగి గవర్నమెంట్ నిర్వహించిన రేటు వచ్చినప్పుడే వేలంపాట నిర్వహిస్తామన్నారు.ఆసక్తి గలవారు 01 లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి మరల నిర్వహించే వేలం పాటలో పాల్గొనుటకు అవకాశం కలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ అలిమొద్దిన్, మున్సిపల్ సిబ్బంది, డిపాజిట్ దారులు పాల్గొన్నారు.

## 31వ డివిజన్లో ఇంటింటికి కాషాయ ధ్వజం పంపిణీ

**కరీంనగర్ బ్యూరో, మార్చి 29, (ప్రజాజ్యోతి)** కరీంనగర్ పట్టణం 31 డివిజన్ పరిధిలోని లక్మినగర్ నివాసి దేవసాని సరస్వతిసత్యనారాయణ ఆధ్వర్యంలో స్వస్తిశ్రీ విశ్వవసు తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రతి ఇంటికి కాషాయ ధ్వజం పంపిణీ చేశారు.ఇట్టి కార్యక్రమంలో కరుణాకర్, రాజేష్,శంకర్,రామారావు,పాపన్న,పవన్ ,బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్, ఓబీసీ రాష్ట కార్యవర్గ సభ్యులు అడిచెర్ల రాజు,ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, సెంట్రల్ జోన్ కన్వీనర్ తణుకు సాయికృష్ణ, మాసం గణేష్, పసుపులేటి శివానందం, గర్దాస్ సతీష్, వంగ సంపత్ పటేల్, వంశీ. శశికాంత్ రాకేష్ సంతోష్ తిరుపతి, తదితరులుపాల్గొన్నారు.



## డా.బంగారి రజనీ ప్రియదర్శినికి అత్యుత్తమ వైద్య సేవా పురస్కారం

- పార్లమెంట్ సభ్యులు శ్రీ రఘునందన్ రావు చేతులమీదుగా హైదరాబాద్ లోని టి హబ్ లో పురస్కార ప్రధానం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 29, (ప్రజాజ్యోతి)** ఇన్ఫర్టిలిటీ వైద్య విభాగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను రాధే గ్రూప్ వారి డాక్టర్స్ ఎక్సెలెన్స్ అవార్డ్ 2025 ను హైదరాబాద్ గచ్చిబౌలి లోనీ టి హబ్ లో మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు చేతులమీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా డా.రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాల సంతోషంగా ఉందని, నేడు సమాజంలో పిల్లలు పుట్టకపోవడం అనేది అతి ముఖ్యమైన సమస్యగా మారిందని, ప్రతి సంవత్సరం పది మంది దంపతులకు రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా ఉచిత ఇన్ఫెర్టిలిటీ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఇలాంటి అవార్డ్స్ అందుకోవడం ద్వారా తన బాధ్యత ఇంకా పెరిగిందని రాబోయే రోజుల్లో తెలంగాణా వైద్య సమాజానికి ఉపయోగపడే విధంగా చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ఆమె తెలిపారు.ఈ అవార్డు సాధించిన సందర్భంగా ఐ ఎం ఎ కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డా. ఎనమల్ల నరేష్ కుమార్, కార్యదర్శి నవీన్ కుమార్ , కోశాధికారి విజయ్ కుమార్, తెలంగాణా మెడికల్ కౌన్సిల్ మెంబర్ డా.రాజ్ కుమార్, రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ ప్రో.డా బంగారి స్వామి శుభాకాంక్షలు తెలిపారు.

## గాయత్రి విద్యానికేతన్ లో ముందస్తు విశ్వావసునామ ఉగాది వేడుకలు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి 29:** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ దంపతులు లక్ష్మీ గణపతి సరస్వతి కి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల కరస్పాండెంట్ అల్లెంకి రజనీ శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు వారి నూతన సంవత్సరానికి మొదటి రోజు, చైత్ర శుక్ల పక్ష పాడ్యమి నాడు జరుపుకుంటారు. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ అన్నారు. ఉగాది పండుగ యొక్క పౌరాణిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరిస్తూ, నూతన సంవత్సర ఆరంభంలో ఆచరించాల్సిన ఆచారవ్యవహారాలు, పంచాంగ శ్రవణం యొక్క ప్రాముఖ్యత, పంచాంగంలోని గ్రహ గమనాలు మన జీవితంపై చూపే ప్రభావం వంటి అంశాల గూర్చి చక్కగా వివరించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పండుగలో ప్రధానమైనది ఉగాది పచ్చడి. తీపి, కారం, చేదు, పులుపు, వగరు, ఉప్పు వంటి షడ్రుచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. జీవితంలో అన్ని భావనలను చెప్పే భావం ఇందులో ఇమిడి ఉంది. పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా అందరికీ విశ్వావసునామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, అందరూ ఈ నూతన సంవత్సరంలో తమ తమ లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ వేడుకల్లో ప్రముఖ వేద పండితులు శ్రీ ప్రవీణ్ సిద్ధాంతి ముఖ్య అతిథిగా పాల్గొని, ఉగాది పండుగ విశిష్ఠతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చేసిన పలు నృత్యాలు అలరించాయి. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వేద పండితుల ప్రసంగం ద్వారా సాంస్కృతిక, ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని పొందారు.

# ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయ యాత్ర

- కరపత్రాలు ఆవిష్కరించిన
- విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నేతలు

**కరీంనగర్ బ్యూరో,మార్చి 29, (ప్రజాజ్యోతి)** ఏప్రిల్ 12వ తేదీన నగరంలోవీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్ , భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్ తెలిపారు.ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలు,వాల్ పోస్టర్లనుశనివారం బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ యాత్ర గాంధీ రోడ్డులోని రామాలయం వద్ద ప్రారంభమై టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్, కమాన్ చౌరస్తా, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, గీత భవన్, కోర్టు రోడ్డు, మంచిర్యాల చౌరస్తా మీదుగా కొనసాగుతుందని తెలిపారు.ఈ యాత్ర ద్వారా హిందూ సమాజన్ని జాగృతం చేయడానికి విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ సింగ్వాజరవుతారని చెప్పారు.ధైర్యం,శక్తి సామర్థ్యాలకు ప్రతీక అయినటువంటి హనుమంతున్ని ఆదర్శంగా తీసుకొని హిందూ యువత దేశ, ధర్మ రక్షణ కోసం పాటుపడాలనీ,లవ్ జీహాదీల నుండి మాతృ మూర్తుల రక్షణ,మత మార్పిడుల నిరోధం కోసం ఈ ర్యాలీలో పాల్గొని విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంత గోరక్ష కమిటీ సభ్యుడు ఊటుకూరి రాధా



కృష్ణారెడ్డి, జిల్లా సహా కార్యదర్శి తోట రాజేందర్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ గుజ్జేటి రాజేందర్, నగర కన్వీనర్ ఎల్లబోయిన మహేష్, నగర గోరక్ష ప్రముఖ్ వంశీ, నగర విద్యార్థి ప్రముఖ్ సంతోష్, నగర సహా సంయోజక్ రంజిత్, అలిమిల్ల సతీష్, నగర సత్సంగ్ ప్రముఖ్ వంగర ఆంజనేయులు,భజరంగ్ దళ్ నగర కన్వీనర్ మహేష్ యాదవ్,అఖిల్, అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి బొగ్గు రవాణాలో ఆల్ టైం రికార్డు

- ఒక్కరోజులో 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా
- ఉద్యోగులకు అభినందనలు తెలిపిన సీ.ఎండీ బలరాం నాయక్

**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి ):** సింగరేణి సంస్థ బొగ్గు రవాణాలో మరో కీలక మైలురాయిని అందుకుంది. శుక్రవారం ఒక్క రోజులోనే మొత్తం 3,25,243 టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేసి సంస్థ కొత్త రికార్డు సృష్టించింది. మూడు షిఫ్టులలో కలిపి అత్యధికంగా బొగ్గు సరఫరా చేయడంతో పాటు, రైల్వే రేకుల ద్వారా గత ఏడాదితో పోల్చితే మరింత ఎక్కువ మొత్తంలో బొగ్గు రవాణా చేయడం కూడా మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్. బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శనివారం ఉదయం డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తన అభినందనలు తెలియజేశారు. ఉద్యోగుల కృషి వల్లే ఈ అరుదైన రికార్డు సాధ్యమైందని, ఇదే తీరుతో వర్షాకాలం వరకు అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా కొనసాగించాలని సూచించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గును ప్రణాళికాబద్ధంగా సరఫరా చేయాలని తెలిపారు.

**థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సమృద్ధిగా బొగ్గు :** విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకున్నా, రాష్ట్రంతో పాటు ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేయగలిగామని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం థర్మల్ కేంద్రాల వద్ద 7.24 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్థాయిలో బొగ్గు సరఫరా కొనసాగించాలని సూచించారు.

**ఉద్యోగుల కృషికి ప్రశంసలు :** శుక్రవారం అత్యధిక బొగ్గు రవాణాలో డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, గనులు, సి.హెచ్.పి.ల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు చేసిన కృషిని సీఎండీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కొత్తగూడెం నుంచి ఎక్కువ పరిమాణంలో బొగ్గు రవాణా జరగడంతో ఆ ఏరియా ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

**కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్ కు పర్యావరణ అనుమతులు:** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగూడెం వెంకటేశ్ ఖని (వీకే) ఓపెన్ కాస్ట్ గనికి పూర్తిస్థాయి పర్యావరణ అనుమతులు లభించాయని వెల్లడించారు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్విరాన్మెంట్ అప్రైజల్ కమిటీ సమావేశంలో ఈ అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. వీకే ఓపెన్ కాస్ట్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు, అలాగే రొంపేడు ఓపెన్ కాస్ట్ (ఇల్లందు) గనికి కూడా త్వరలో అనుమతులు రానున్నాయని చెప్పారు. వచ్చే ఏడాది నిర్దేశించిన 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్య నారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం. సుభానీ, జీఎం (సీపీపీ) మనోహర్, జీఎం (మార్కెటింగ్) ఎన్.వి. రాజశేఖరరావు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.





## భద్రతను ప్రథమ ప్రాధాన్యతగా ఉంచుకుని లక్ష్యాలను సాధించాలి

- డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ



**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి ):** నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో కూడిన విధంగా సాధించాలని. సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించి, ప్రాజెక్ట్ లో జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఉత్పత్తి లక్ష్యాలను భద్రతను కాపాడుతూ సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, బోల్టర్ మైనింగ్, లాంగ్ వాల్ పనులపై చర్చించారు. లాంగ్ వాల్ సాల్వేజింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని మెరుగుపరచాలని సూచించారు. అలాగే, లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ కె. యాదయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ టి. రఘురాం, డిజియం కె. జనార్దన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సోదర భావాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందు

- డాక్టర్ యు కుమార్



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 29** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల మసీదులో ముస్లిం సోదరులకు హిఫ్తార్ విందు కార్యక్రమాన్ని డాక్టర్ యు కుమారు శనివారం రోజున ఏర్పాటు చేశారు ఆయన్ని ముస్లిం సోదరులు అభినందించారు ఈ కార్యక్రమంలో ఎండి రహీం ఖాన్ ఎండి మునీర్ లాల్ మహమ్మద్ గోరేమియా తాజుద్దీన్ సాజిద్ రాజ్ మహమ్మద్ హుస్సేన్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

# చదువుతోనే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగగలరు

- రామగిరి కస్తూరిబా బాలికల విద్యాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- విద్యార్థినులకు మరిన్ని వసతుల కల్పనా
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ. శ్రీధర్ బాబు





**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి) :**చదువుతోనే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగగలరనీ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ. శ్రీధర్ బాబు అన్నారు. రామగిరి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అభివృద్ధి దిశగా మరొక ముందడుగు వేసింది. మంత్రి శ్రీధర్ బాబు శనివారం విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ. శ్రీహర్ష, ఆర్డీఓ సురేష్, ఆర్జీ–3 జీఎం నరేంద్ర. సుధాకర్ రావు లతో కలిసి సందర్శించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం 67 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న అప్రోచ్ రోడ్, ప్రహరీ గోడ పనులకు వారితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. విద్యార్థినుల నాణ్యమైన విద్యకు, భద్రతకు, మరిన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

**విద్యార్థినుల అభ్యాస, భోజన వసతులపై మంత్రి ఆరా :**

ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించిన మంత్రి శ్రీధర్ బాబు వారి అభ్యాస పరిస్థితులు, అందుతున్న భోజన వసతులపై ఆరా తీశారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలు, వారికి ఎదురవుతున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. "మీరు ఉత్తమంగా చదివి మంచి మార్కులు సాధిస్తే, పాఠశాలలో మరిన్ని సదుపాయాలను ఏర్పాటుకు, అదనపు బోధన సిబ్బంది నియామకనికి, పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**బాలికల భవిష్యత్తు వెలుగొందాలి :**

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా విద్యార్థినులు సాధారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకుంటూ, ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతున్నారని, వారి భవిష్యత్తు వెలుగొందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిత్యం విద్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. "మీరు చదువులో రాణిస్తే, మీరు మాత్రమే కాదు, మీ కుటుంబం, సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది" అని, మీకు అవసరమైన అన్ని వసతులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని విద్యార్థినులకు స్పష్టం చేసారు ఈ కార్యక్రమం లో ఎమ్మార్వో పి.సుమన్, విద్యాలయ ప్రిన్సిపల్ మంజుల, బోధన సిబ్బంది, విద్యా శాఖ అధికారులు, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల.తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటం.సత్యం, పన్నూరు గ్రామ శాఖ అధ్యక్షుడు గాజుల.శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆరెల్లి.దేవక కొమురయ్య గౌడ్, కోరకొప్పుల నీరజా తులసీరాం గౌడ్, మాజీ జెడ్పిటిసిలు మైదం భారతి వరప్రసాద్, నాగినేని జగన్మోహన్ రావు, ఏల్లె శశిరేఖ రామ్మూర్తి, మాజీ సర్పంచులు తీగల సమ్మయ్య దేవునూరి రజిత శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు చిందం.మహేష్, రెండ్ల.సందీప్, కొప్పుల గణపతి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చట్టానికి లోబడి అధికారులంతా జవాబు దారి తనంతో పని చేయాలి

- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు
- మండల కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా స్థల ఎంపిక
- ఉగాది నుండి రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా
- తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి), మార్చి–29 :** చట్టానికి లోబడి అధికారులంతా జవాబు దారి తనంతో పని చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి కమాన్ పూర్ మండలంలో 50 లక్షల డి.ఎం.ఎఫ్.టి నిధులతో వ్యయంతో చేపట్టిన తహసిల్దార్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,ప్రజలకు ఉపయోగపడే కార్యాలయాల నిర్మాణ పనులను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. కమాన్ పూర్, రామగిరి మండల కేంద్రాలలో తహసిల్దార్ కార్యాలయం భవనం, మంథని డివిజన్ కేంద్రంలో సమీకృత అధికారుల సముదాయం,నూతన ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఉన్న సమస్యలను చట్ట ప్రకారం పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులలో జవాబుదారితనం తీసుకుని రావడానికి చర్యలు చేపట్టామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ వల్ల జరిగిన నష్టాలను భూ భారతి చట్టంతో పూడ్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని అన్నారు. చట్టానికి లోబడే మాత్రమే అధికారులంతా పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. మండల కేంద్రాలలో కూడా కార్యాలయాలు అంతా ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా అనువైన స్థలాలను ఎంపిక చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. కుమార్ పూర్ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కార్యాచరణ చేపడతామని, దీనికి ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని మంత్రి కోరారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. పాఠకుల కోసం ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం నిర్మిస్తామని అందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి సూచించారు.ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రతి రోజూ కమాన్ పూర్ మండలంలో వేలాది మహిళలు వినియోగించు కుంటున్నారని అన్నారు. మహిళలకు 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. రైతులకు 2 లక్షల రుణ మాఫీ, 500 రూపాయల బోనస్ అందించామని మంత్రి తెలిపారు.రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఉగాది నుండి రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయనున్నామని అన్నారు. రైతులకు ఒక గింజ కూడా తాళ్ళు కట్ చేయకుండా మద్దతు ధర పై ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. ఉద్యమ సమయంలో కూడా కమాన్ పూర్ మండలానికి జూనియర్ కళాశాల, జే.ఎన్.టి.యూ ఇంజనీరింగ్ కళాశాల, హార్టికల్చర్ యూనివర్సిటీ, 130/32 సబ్ స్టేషన్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నేడు కమాన్ పూర్ మండలం తో పాటు రామగిరి, ముత్తారం మండలాల్లో కూడా నూతన తహసిల్దార్ కార్యాల భవనాలను నిర్మిస్తున్నామని , మంథని లో డివిజన్ కు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమీకృత కార్యాలయాల సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామని అన్నారు. అనంతరం రామగిరి మండలంలో 65 లక్షలతో చేపట్టిన తహసిల్దార్ భవన నిర్మాణ పనులకు, 67 లక్షలతో చేపట్టిన కస్తూర్బా గాంధీ విద్యాలయానికి అప్రోచ్ రోడ్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం వద్ద 4.5 కోట్ల డి.ఎం.ఎఫ్.టి నిధులతో చేపట్టిన సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నిర్మాణ పనులకు, 30 లక్షలతో చేపట్టిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు రిన్నోవేషన్ పనులకు, 35 లక్షలతో చేపట్టిన ముత్తారం కస్తూర్బా గాంధీ విద్యాలయ అభివృద్ధి పనులకు, 80 లక్షలతో చేపట్టిన ముత్తారం మోడల్ స్కూల్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ లు ఎస్ ఇ పి ఆర్ కే చక్రవర్తి ఈ ఈ పి పి ర్.గిరీష్ బాబు, డి ఈ.నవీన్ కుమార్ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# నవాబుపేటలో ముగిసిన ఎన్ఎస్ఎస్ వేసవికాల ప్రత్యేక శిబిరం

- వాలంటీర్ల సేవా దృక్పథాన్ని అభినందించిన గ్రామస్థులు




**చిగురుమామిడి మార్చి 29(ప్రజా జ్యోతి)** వాగేశ్వరి మహిళా డిగ్రీ,పి.జి కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం శీతకాల శిబిరంలో భాగంగా 5వరోజు చిగురుమామిడి మండలం నవాబుపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో సామాజిక సర్వే చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిగమా విద్యా సంస్థల అధినేత బివిఆర్ గోపాల్ రెడ్డి,నిగమ విద్యాసంసల జాయింట్ సెక్రటరీ డాక్టర్ రత్న గోపాల్ హాజరై వాలంటీర్స్ ని ఉద్దేశించి మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థినులు చదువుతో పాటు సామాజిక సేవా చేయడంలోనూ ముందుంటారని కొనియాడారు.ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ వాలంటీర్స్ ఆరు రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు.ప్రాథమిక ఉన్నత పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా చేయడం జరిగిందన్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగిందన్నారు.సుందరగిరి గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు మానవ హారం నిర్వహించి చట్టాల మిద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.సామాజిక సర్వే నిర్వహించి ప్రజా సమస్యలని అడిగి నమోదు చేసుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ వెంకట్ రెడ్డి,సతీష్ గౌడ్,లింగమూర్తి కామర్స్ లింగా రావు,సీనియర్ అధ్యాపకులు అరుణ్,మనోజ్, ఈ కార్యక్రమానికి సహకరించిన కేతిరెడ్డి రాఘవ రెడ్డి,గుళ్ళ ప్రసాద్,గుళ్ళ వెంకటేష్, గుళ్ళ నాగరాజు,దామ పందరి,సిద్ధి రాజశేఖర్ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ నందగిరి స్వప్న,అధ్యాపకులు సంగీత, మౌనిక,మమత,వాలంటీర్స్ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏసీబీ అధికారులకు చిక్కిన అవినీతి అధికారి,ఓ సెక్యూరిటీ గార్డ్




**కరీంనగర్ క్రైం,మార్చి 29,ప్రజాజ్యోతి** ఏసీబీ వలకి అవినీతి అధికారి,ఓ సెక్యూరిటీ గార్డ్ చిక్కారు.రూ.60వేలు లంచం తీసుకుంటూ కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఏవుసం పురుషోత్తం,అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డ్ కరివేద శ్రీనివాస రెడ్డిలు శనివారం ఏసీబీ వలకి చిక్కారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ హోల్‌సేల్ పండ్ల వ్యాపారం కమిషన్ ఏజెంట్ లైసెన్స్ పునరుద్ధరణ కోసం ఫిర్యాదుదారుడిని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఏవుసం పురుషోత్తం,అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డ్ కరివేద శ్రీనివాస రెడ్డిలు లంచం డిమాండ్ చేశారు, శనివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రూ.60వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాము,నిందితుల పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను దాచిపెట్టామని పేర్కొన్నారు, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ యొక్క టోల్ ఫ్రీ నంబర్‌ను అంటే 1064ను సంప్రదించాలని కోరారు,

## మృతుడి కుటుంబాన్ని పరామర్శ

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్



**కాల్వశ్రీరాంపూర్ ప్రజాజ్యోతి మార్చి 29:** కాల్వ శ్రీరాంపూర్ మండల లోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఎండి మహమ్మద్ ఇటీవల మృతి చెందారు మృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శనివారం పరామర్శించి సంతాపాన్ని వెలబుచ్చారు ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వీణ సదయ్య ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్ రావు కడెం మహేష్ రాజు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు కమిటీల నియామకం

**కరీంనగర్ రూరల్, మార్చి 29, ప్రజాజ్యోతి:** జై బాపు,జై భీమ్,జై సంవిధాన్, రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు సంబంధించి కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండల కమిటీలను శనివారం నియమించారు,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ హాజరయ్యి కమిటీలను నియమించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై బ్లాక్ కాంగ్రెస్ ఆధ్యక్షులుగా సాయిని తిరుపతి, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు కాంరెడ్డి రాంరెడ్డి,కొత్తపల్లి మండల అధ్యక్షులు పంజాల స్వామీ గౌడ్ లను నియమించడం జరిగిందన్నారు,ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

## విజన్ హై స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ సంబరాలు




**కరీంనగర్ రూరల్,మార్చి 29,ప్రజాజ్యోతి:** రేకుర్తిలోని విజన్ హై స్కూల్ లో శనివారం గ్రాడ్యుయేషన్ సంబరాలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ హాజరయ్యారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ లోని యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సంవత్సరం పిపి2 యూకేజీ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో విద్యార్థులందరూ ఒక ఉన్నతమైన విలువలతో కూడిన విద్యను నేర్చుకొని, వారందరూ ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు,ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ఆటపాటలు, నృత్యాలు అందరినీ ఎంతగానో అలరించాయి,ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ మల్లయ్య,వెంకట్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్వామి కళ్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**చొప్పదండి, మార్చి 29 ( ప్రజాజ్యోతి):** గుమ్లాపూర్ లో శ్రీ లక్ష్మి వెంకట నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యంను ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగల రాజేందర్, మాజీ కౌన్సిలర్ పేరుమండ్ల గంగయ్య, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ కోలాపూరి శ్రీకాంత్ ,ఆలయ అర్చకులు కిష్ట మూర్తి, దుంపల ఐలేందేర్, మాజి సర్పంచ్ మునగాల సుధాకర్ గౌడ్, తొడేటి డేవిడ్, పెరుమండ్ల పర్శరాం పాల్గొన్నారు.

# నేడే యుగాది



(మొదటి పేజీ తరువాయి...)

పంచాంగాన్ని పరిచయం చేశాడని అంటారు. శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు మొదలైన వారు ఉగాదినాడే పట్టాభిషిక్తులైనారని ఆర్యులు చెబుతారు. సంవత్సరాది నాడు ప్రజలు తెల్లవారక ముందే నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, తలకు స్నానం చేసి కొత్త బట్టలు ధరించి, ఇష్టదైవానికి పూజలు చేసి, షడ్రుచుల పచ్చడిని ఆరగించాలి. నిర్ణీత సమయంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం చేయాలి.

తిథిర్వారంచ నక్షత్రం యోగః కరణమేవచ,

పంచాగస్య ఫలం శృణ్వన్ గంగాస్నాన ఫలం లభేత్.

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే పంచాంగ శ్రవణం వల్ల గంగా స్నానంతో సమానంగా పుణ్యం, పురుషార్థం లభిస్తుందని పై శ్లోకం చెబుతున్న భావం. కొత్త సంవత్సరంలో గ్రహ, రాశిఫలాల్లో, నామ నక్షత్రాల్లో తేడా వస్తే దోషనివారణ కోసం శాంతి హోమాలు, వ్రతాలు, పూజలు చేసి సుఖశాంతులతో ప్రజలు జీవించడానికి పంచాంగ శ్రవణం ఉపయోగపడుతుంది. నవగ్రహాల్లో సూర్యుడు తేజస్సును, చంద్రుడు భోగభాగ్యాలను, కుజుడు శుభాలను, బుధుడు బుద్ధివికాసాన్ని, గురుడు జ్ఞానవిత్తాన్ని, శుక్రుడు కార్యసిద్ధిని, శనీశ్వరుడు దుఖ వినాశాన్ని, రాహువు సంతోషకరమైన రాణింపును, కేతువు చెప్పుకోదగినంత గొప్పదనాన్ని కలిగిస్తారని విద్వాంసులు చెబుతారు.

ఆరోగ్యమనే మహాభాగ్యాన్ని కలిగించేది ఉగాది పచ్చడి. శాస్త్రవచనాల్లో దానికి నింబకుసుమ భక్షణం, అశోకకళికా ప్రాశనం అనే పేర్లు కూడా ఉన్నాయి. తీపి, ఉప్పు, చేదు, వగరు, పులుపు, కారం సమపాళ్లలో కలిపి ఈ పచ్చడిని తయారు చేస్తారు. తీపికి బెల్లం, ఉప్పునకు ఉప్పు, చేదుకు వేపపూత, వగరుకు మామిడి ముక్కలు, పులుపునకు చింత పండు, కారమునకు మిరియాలు ఉగాది పచ్చడిలో వాడు తారు. వీటికి తోడు తమతమ ఇష్టాలను బట్టి జీలకర్ర, అరటిపండ్లు, ఎండుద్రాక్ష, జీడిపప్పు వంటివి కూడా కలిపి గొప్ప ఔషధంగా ఆరగిస్తారు. ఈ పచ్చడిని చైత్ర శుద్ధ పాడ్యమి మొదలు ఒక పక్షం రోజులు సేవిస్తే వాత, పిత్త, కఫములకు చెందిన రోగాలన్నీ పటాపంచలవుతాయని వైద్యశాస్త్రం చెబుతుంది. భారతదేశంలో ఆంధ్ర రాష్టేతరులు సైతం సంవత్సరాది ఉత్సవాలను జరుపుకుంటారు. తమిళులు, మళయాళీలు, మరాఠీలు, సిక్కులు ఈ పండుగను జరుపుకోవడం మనకు తెలుసు.

ఉగాది పర్వదినం ఈ సంవత్సరం నేడు మార్చి 30న పిలువబడే

శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది

ఈ ఉగాది తెలియపరిచే కొన్ని విషయాలు

తెలుగు సంవత్సరాది ఉగాది. జీవన రాగాన్ని ఆలపించే కోయిల గానాలూ, మమతల పరిమళాలు పంచే ప్రసవాలతో ఆహ్లాద వాతావరణం. కష్టాల వడగాడ్పులకు చలించక చైత్రంలో తరువుల్లా స్థిరంగా నిలవడమే లక్ష్యం. ఒక్కోసారి ఆశల ఆకులు రాలినా మళ్లీ చిగురు తొడుగుతుందనే ధీమా, నవ జీవితానికదే నాంది, మరెన్నో ఉగాదులకు పునాది. చైత్ర మాసంలో ప్రకృతి సప్త వర్ణ శోభితం ఆవుతుంది. మోడువారిన తరువులు చిగురాకుల చీరలు చుట్టి హొయలుపోతాయి. అందాకా మూగబోయిన కోకిల గొంతు సవరించుకుని కిలకిలరావాలు పలికిస్తుంది. పల్లవాలు సోయగాలు. పోతే మల్లెలు మధుర పరిమళాలు వెదజల్లుతాయి. ఎటు చూసినా ఆనందాలూ ఆహ్లాదాలతో హృద్యంగా ఉంటుంది. చైత్ర మాసాన్ని మధు మాసంగానూ పిలుచు కుంటాం. మధువు అంటే తేనె. జీవితం తేనెలా అమృతతుల్యం కావాలనేది ఆంతర్యం. పురాణాలను అనుసరించి బ్రహ్మదేవుడు ఈ సమస్త చరాచర విశ్వాన్ని చైత్రమాస శుక్లపక్ష పాడ్యమి నాడు ప్రారంభించాడు. అందుకే చైత్ర ఆరంభ దినాన్ని వేడుక చేసుకోవడం ఆనవాయితీ.

అబ్బాదౌ నింబకుసుమం శర్కరామ ఘృతైర్యుతం భక్షితం పూర్వయామే తు తద్వర్షే సౌఖ్యదాయకం శతాయు వజ్రదేహాయ సర్వసంపత్కరాయ చ సర్వారిష్ట వినాశాయ నింబకం దళ భక్షణం.ఉగాది రోజున మన శక్తికి తగ్గట్టుగా పూర్ణ కుంభదానం చేయడం శ్రేష్ఠం. వెండి, రాగి లేదా మట్టి పాత్రను నీళ్లతో నింపుతారు. అందులో గంధం, పూలు, అక్షతలు, మామిడి, వేప, మోదుగ, నేరేడు, అశోక తదితర పత్రాల చిగుళ్లు వేసి పూజిస్తారు. ఆ కుండను గురువులకు కానీ పెద్దలకు కానీ ఇంటి పురోహితుడికి గానీ ఇచ్చి వారి ఆశీస్సులను పొందుతారు.

చైత్రే మాసి జగద్భహ్మ ససర్జ ప్రథమేహని శుక్లపక్షే సమగ్రం తు తదా సూర్యోదయే సతి

శ్రీమహావిష్ణువు మత్స్యావతారమెత్తి సోమకాసురుడి నుంచి వేదాలను రక్షించి బ్రహ్మదేవుడికి అంద జేశాడు. ఆ శుభదినమే ఉగాది అనే కథనమూ ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉగాదిని మత్స్య జయంతిగా వేడుక చేసుకునే ఆచారం ఉంది.

### ఉగాది నాడు ఏం చెయ్యాలి?

ఉగాది అంటే ముందుగా గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనమైన ఆ ప్రసాదం సేవించడంతోపాటు ఆచరించాల్సిన శాస్త్రోక్త విధులున్నాయి.

నూతన సంవత్సర కీర్తనాద్యారంభం ప్రతి గృహధ్వజారోహణం నింబ పత్రాశనం వత్సరాది శ్రవణం నవ రాత్రారంభః

నూతన సంవత్సర ఆరంభాన్ని సూచిస్తూ ఉగాది ఆసన్నమయ్యే వేళ భగవత్ కీర్తనలు పాడుకుంటూ కాలక్షేపం చెయ్యాలి. ద్వారాలను తోరణాలతో అలంకరించాలి. తీపి, పులుపు, కారం, చేదు, ఉప్పు, వగరు కలగలసిన పచ్చడిని ఆస్వాదించాలి. ఇందులో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్యదాయకమే. ముఖ్యంగా వేపపూత శరీరంలో చేరిన క్రిములను నశింపచేస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సమానంగా స్వీకరించాలనేందుకు ప్రతీకగా షడ్రుచులతో మిశ్రితమైన ఉగాది పచ్చడి సేవిస్తారు. ఎలాంటి అనుభవం ఎదురైనా స్థిరచిత్తంతో ఎదుర్కోవాలనే హితబోధ ఇందులో ఉంది. దాన్ని ఆరగించేముందు..

శతాయుర్వజ్రదేహాయ సర్వసంపత్కరాయచ

సర్వారిష్ట వినాశాయ నింబకం దళ భక్షణం అనే శ్లోకం పఠించాలి. ఉగాది పచ్చడి సేవనంతో వజ్ర సమానమైన దేహం, దీర్ఘాయుష్షు లభిస్తాయన్నారు మహర్షులు.

తిథిప్రోక్తం మను బ్రహ్మ వారస్య మయసంభవం నక్షత్రం త్వష్ట రూపంచ శిల్పయోగం తద్దైవచ దైవజ్ఞం కరణంబైన ఇత్యేత అంగ లక్షణందీన్ని బట్టి తిథిని మన బ్రహ్మ, వారాన్ని మయబ్రహ్మ, నక్షత్రాన్ని త్వష్ణబ్రహ్మ, యోగాన్ని శిల్పి బ్రహ్మ, కరణాన్ని విశ్వజ్ఞబ్రహ్మ ఇలా పంచాంగాన్ని పంచబ్రహ్మలు సృష్టించారని. అర్ధమవుతోంది. ఈ పంచ బ్రహ్మలనే సనాతన బ్రహ్మలని పిలుస్తారు.

### ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఎందుకు చేస్తారు?

తిథౌశ్చ శ్రియమాప్నోతి వారాదాయుష్యవర్ధనం నక్షత్రాత్ హరతే పాపం యోగాద్రోగ నివారణం కణాత్కార్యసిద్ధిస్తు పంచాంగ ఫలముత్తమం కాల విత్కర్మకృత్ ధీమాన్ దేవతానుగ్రహం లభేత్

మనం ఏం చేసినా సత్ఫలితాలను ఆశిస్తాం. అందుకే పంచాంగ శ్రవణానికి ప్రయోజనాలను కల్పించారు. మహర్షులు. తిథుల శ్రవణ ఫలితంగా సంపదలు, వార శ్రవణంతో దీర్ఘాయుష్షు, నక్షత్రం గురించి తెలుసుకోవడం వల్ల పాపహరణం, యోగ శ్రవణమూలంగా రోగ నివారణ, కరణ శ్రవణ ఫలంగా కార్యసిద్ధి ప్రాప్తిస్తాయన్నారు. కనుకనే ఉగాదినాడు పంచాంగ శ్రవణంతో తరిస్తారు.

ఆధ్యాత్మిక కోణం బంధుమిత్రులతో జీవితాన్ని నిత్య నూతనంగామలచుకోవడమే పర్వదినాల అంతరార్థం. ఉగాది కూడా అందరితో కలిసి వేడుకలా జరుపుకోవాలి.

అబ్దాదౌ బంధుసంయుక్తే మంగళస్నానమాచరేత్ వస్త్రం రాభరణై ర్దేహమలంకృత్య తత శ్చుచిః

ఉగాది కాల సంబంధమైన పర్వం కనుక ఆదిత్యుణ్ణి, విశ్వసృజనకు ఆరంభ దినం కాబట్టి సృష్టికర్త బ్రహ్మను ఆరాధించాలి. అలాగే ఇష్టదేవతలను పూజించి, పెద్దల ఆశీస్సులు అందుకోవాలి. శ్రీరామనవమిని తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించడం ఆచారం. దానికి ఆరంభదినం ఉగాదే.

రాబోయే సంవత్సరంలో ఎలాంటి మంచి చెడులు జరగబోతున్నాయో తెలుసుకునేందుకు ఉగాదినాడు పంచాంగ శ్రవణం చేయడం పరిపాటి. పంచాంగమంటే తిథి వార నక్షత్ర యోగ కరణాలనే ఐదింటి కలయిక. బ్రహ్మదేవుడి ఐదు ముఖాల్లో తూర్పు ముఖం నుంచి తిథి, దక్షిణ ముఖం నుంచి వారం, పశ్చిమ ముఖం నుంచి నక్షత్రం, ఉత్తర ముఖం నుంచి యోగం, ఊర్ధ్వముఖం నుంచి కరణం అనే ఐదు అంగాలు ఉద్భవించాయి.

పంచాంగం ఎలా పుట్టిందో తెలియజేసే మరో శ్లోకం కూడా ఉంది..తిథిప్రోక్తం మను బ్రహ్మ వారస్య మయసంభవం నక్షత్రం త్వష్ట రూపంచ శిల్పయోగం తద్దైవచ దైవజ్ఞం కరణంబైన ఇత్యేత అంగ లక్షణం

దీన్ని బట్టి తిథిని మన బ్రహ్మ, వారాన్ని మయబ్రహ్మ, నక్షత్రాన్ని త్వష్ణబ్రహ్మ, యోగాన్ని శిల్పి బ్రహ్మ, కరణాన్ని విశ్వజ్ఞబ్రహ్మ ఇలా పంచాంగాన్ని పంచబ్రహ్మలు సృష్టించారని. అర్ధమవుతోంది. ఈ పంచ బ్రహ్మలనే సనాతన బ్రహ్మలని పిలుస్తారు.

### పంచాంగ శ్రవణం ఎందుకు?

తిథౌశ్చ శ్రియమాప్నోతి వారాదాయుష్యవర్ధనం నక్షత్రాత్ హరతే పాపం యోగాద్రోగ నివారణం కణాత్కార్యసిద్ధిస్తు పంచాంగ ఫలముత్తమం కాల విత్కర్మకృత్ ధీమాన్ దేవతానుగ్రహం లభేత్మనం ఏం చేసినా సత్ఫలితాలను ఆశిస్తాం. అందుకే పంచాంగ శ్రవణానికి ప్రయోజనాలను కల్పించారు. మహర్షులు. తిథుల శ్రవణ ఫలితంగా సంపదలు, వార శ్రవణంతో దీర్ఘాయుష్షు, నక్షత్రం గురించి తెలుసుకోవడం వల్ల పాపహరణం, యోగ శ్రవణమూలంగా రోగ నివారణ, కరణ శ్రవణ ఫలంగా కార్యసిద్ధి ప్రాప్తిస్తాయన్నారు. కనుకనే ఉగాదినాడు పంచాంగ శ్రవణంతో తరిస్తారు.

# కరీంనగర్ రూరల్ నేర సమీక్ష సమావేశం

**కరీంనగర్ క్రైం,మార్చి 29, ప్రజాజ్యోతి** నెలవారీ నేరసమీక్ష సమావేశంలో భాగంగా కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం శనివారం నిర్వహించారు,ఈ సందర్భంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం ను సరైన పద్ధతిలో అవలంభించాలన్నారు.స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు వారి వారి పరిధిలోని పోలీసు స్టేషన్లను తరుచూ సందర్శిస్తూ వారి పనితీరును పర్యవేక్షించాలన్నారు.డివిజన్ ల వారీగా ఏసీపీ అధికారులు డివిజన్ స్థాయిలో ప్రతినెల నేర సమీక్షలు నిర్వహించాలన్నారు.సీసీపీ ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత కల్పించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆకస్మాత్తుగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను పరిష్కరించేందుకు సరైన



లాఠీ,హెల్మెట్ మొదలగు వాటిని ఎల్లపుడు కలిగి వుండి సంసిద్ధంగా వుండలన్నారు. ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహిస్తున్న ఎస్సై,ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీసు స్టేషన్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించాలన్నారు.పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పట్టుబడి పోలీసు స్టేషన్లలో వదిలివేయబడిన వాహనాలను వేలం వేయుటకు పై అధికారులకు తెలపాలన్నారు.రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను,కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పాయింట్ బుక్ ల ఏర్పాటు, సమన్లు మొదలుగు విధులను సమర్ధవంతంగా నిర్వహించాల




న్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఐపీఎస్ , కొత్తపల్లి ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహిస్తున్న వసుంధర ఐపీఎస్ , ఇన్స్పెక్టర్లు ప్రదీప్ (రూరల్), ప్రకాష్ (చొప్పదండి ), స్వామి (తిమ్మాపూర్ ) లక్ష్మీనారాయణ (మానకొండూర్) సంతోష్‌కుమార్ (సీసీఆర్బి) ,డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్సై లు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది సందర్బంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం

**ధర్మపురి (మార్చి 29)ప్రజా జ్యోతి :** మార్చి 30 ఆదివారం రోజున ఉగాది –2025 –శ్రీ విశ్వా వసు నామ తెలుగు నూతన సంవత్సరం పురస్కరించుకొని శ్రీ స్వామివారి ప్రధానాలయంతోపాటు అన్ని ఉప ఆలయాలలో, శ్రీరామలింగేశ్వర ఆలయం శివాలయం లో ఉదయమునే ప్రత్యేక పూజలు నిర్వ హించి భక్తులకు దర్శనాలు క ల్పించ బ డును. అ దేవిధ ంగా సాయంత్రం 4గంటల నుండి శేషప్ప కళా వేదిక పైన బుగ్గారపు రాజేంద్రప్రసాద్ చే పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించబడును.అనంతరం వేదం, సాహిత్యం, నాటక రంగం, పురాణం మరియు జ్యోతిష్యం వంటి కళలు యందు నిష్ణాతులైన వారికి దేవస్థానం వారి పక్షాన సన్మాన కార్యక్రమము కలదు.కావున ధర్మపురి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరుచున్నాము అనికార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, జక్కు రవీందర్ దేవస్థానం చైర్మన్ ,ధర్మకర్తల మండలి వారు తెలిపారు.



## జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ లో ముందస్తు ఉగాదిసంబరాలు




**జగిత్యాల టౌన్,మార్చి29, (ప్రజాజ్యోతి)** జగిత్యాల పట్టంములోనిస్థానిక జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ లో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలచే ముందుగా శ్రీ విశ్వావసు తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది రోజు ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ షడ్రుచులతో కూడిన పచ్చడిని తయారుచేసి రకరకాల పిండి వంటకాలతో సకుటుంబ సమేతంగా నూతన పంచాంగ శ్రావణిని ఆచరిస్తూ జరుపుకోవడం ఈ ఉగాది పండుగ ప్రత్యేకత పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు నేర్పిస్తూ మన సాంస్కృతి సాంప్రదాయాలను మరియు పండగలను జరుపుకునే భావాన్ని వారికి నేర్పించాలన్న ఒక సదుద్దేశంతో ముందస్తుగా ఉగాది సంబరాలను నిర్వహించడమే కాకుండా ప్రత్యేకంగా పచ్చడిలో కలిపే తీపి, పులుపు, ఉప్పు, చేదు ,కారం ,వగరు కలిపి ప్రత్యేకంగా ఉగాది పచ్చడిని తయారుచేసి పచ్చడిలో కలిపే తీపి ఆనందానికి సంకేతం, ఉప్పు జీవితంలో ఉత్సాహం రుచికి సంకేతం ,చేదు బాధను కలిగించే అనుభవాలకు సంకేతం , పులుపు నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులకు సంకేతం మరియు కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని జీవితంలో కష్టసుఖాలకు ఓర్చుకొని ఒక సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఒక నూతన అధ్యాయనమే ఈ ఉగాది పచ్చడి ప్రత్యేకత అని తెలుపుతూ వేడుకలు జరుపుకున్నారు పిల్లలకు మరియు అధ్యాపకులకు మరియు శ్రేయోభిలాషులకు మిత్రులకు ముందస్తు తెలుగు నూతన శ్రీ విశ్వా వసు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అజితరావు, హరిచరన్ రావు, మౌనికరావు, శ్రీధర్ రావు విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ను కలిసిన బి ఆర్ఎస్ నేతలు

**చొప్పదండి ,మార్చి 29 (ప్రజా జ్యోతి):** మాజీ శాసన సభ్యులు సుంకె రవిశంకర్ ను చొప్పదండి మండలం మల్లన్న పల్లె గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నేతలు శనివారం కలిసి తెలుగు నూతన విశ్వవసు నామ సంవత్సర శుభాకాంక్షలను ముందస్తుగా తెలియజేసారు.కార్యక్రమంలో బి అర్ ఎస్ వైనియోజకవర్గ ఉపాధ్యక్షులు భక్తు విజయకుమార్,మండల ప్రధానకార్యదర్శి విద్యార్థి విభాగం దుర్గం గంగాదర్, ప్యాక్స్ మాజి డైరెక్టర్ బండారి కొమురయ్య, ఏ ఎం సి మాజి డైరెక్టర్ బండారి స్వామి,గ్రామశాఖ ఉపాధ్యక్షుడు జాడి చంద్రయ్య,సీనియర్ నాయకుడు బండారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాలనలో పారదర్శకతే లక్ష్యం

▪ **రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ, శ్రీధర్ బాబు**

**రామగిరి, మార్చి 29 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్య లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి కమాన్ పూర్ మండల కేంద్రంలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న తహసిల్దార్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు.

**పబ్లిక్ కార్యాలయాల సమీకరణ :** ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని, అందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం :** గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ కారణంగా రైతులు ఎదుర్కొన్న సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని, రైతుల భూసమస్యలు త్వరలోనే చట్టబద్ధంగా పరిష్కారం అవుతాయని తెలిపారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ విధానం:** ప్రభుత్వ హామీలను అమలు చేయడంలో కదలిక లేని కట్టుబాటు కలిగి ఉన్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా:

– ఉగాది పండుగనుంచి రేషన్ కార్డు దారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ
– రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ
– ధాన్యానికి తగిన మద్దతు ధరతో పాటు, తాళ్లు కట్ చేయకుండా కొనుగోలు

**మండల అభివృద్ధి ప్రణాళికలు :**

– సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
– షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనల పరిశీలన
– గ్రంథాలయ నిర్మాణం కోసం స్థల ఎంపిక
– మహిళలు, రైతులకు మరిన్ని సంక్షేమ పథకాలు

**ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది :** ఉద్యమ సమయంలోనే కమాన్ పూర్ ప్రాంతానికి జూనియర్ కళాశాల, జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాల, హార్టికల్చర్ యూనివర్సిటీ, 130/32 సబ్ స్టేషన్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు. భవిష్యత్తులో ప్రజా సంక్షేమానికి మరిన్ని ప్రణాళికలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, తహసిల్దార్ వాసంతి, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మరిచివెళ్లిన సెల్ ఫోన్ ను తిరిగి బాధితుడికి అప్పగించిన లేక్ పోలీస్

**కరీంనగర్ క్రైం,మార్చి 29, ప్రజాజ్యోతి** డ్యామ్ కట్ట పై మరిచివెళ్లిన సెల్ ఫోన్ ను తిరిగి బాధితుడికి శనివారం లేక్ పోలీస్ కానిస్టేబుల్ మొహమ్మద్ గౌస్ అప్పగించారు,కరీంనగర్ డామ్ కట్టపైకి కాలక్షేపానికి వచ్చిన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ కి చెందిన మహమ్మద్ సల్మాన్ తన మొబైల్ ఫోన్ ను అక్కడే పెట్టి మర్చిపోయాడు. అటుగా వెళ్తున్న లేక్ పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది మొహమ్మద్ గౌస్ ఆ మొబైల్ ఫోన్ ని గమనించి బాధితుడికి తిరిగి అందజేశారు.బాధితుడికి మొబైల్ ఫోన్ ను అందించినందుకు గౌస్ కానిస్టేబుల్ ను ఉన్నతాధికారులు అభినందించారు.




## వేసవి సెలవుల్లో టీచర్ల బదిలీలు పదోన్నతులు చేపట్టాలి

**జగిత్యాల టౌన్, మార్చి29, (ప్రజాజ్యోతి)** పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు చేపట్టాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయినిపెల్లి ఆనంద్ రావు అన్నారు కోడిమ్యాల్ మండల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిప్పాయపల్లె గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు పదవి విరమణ సన్మాన మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల తో సహా మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయులు అందరికీ మే నెల లో బదిలీలు పదోన్నతులు కల్పించాలని కోరారు పాఠశాల పని దినాలకు ఇబ్బంది కలగకుండా విద్యార్థులకు నష్టం జరగకుండా షెడ్యూల్ ని రూపొందించి వేసవి సెలవుల లో నిర్వహించాలని సూచించారు ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు 37 సంవత్సరాలుగా స్కూల్ అసిస్టెంట్ గా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా మండల విద్యాధికారిగా పనిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేశారని సేవే లక్ష్యంగా పాఠశాల అభివృద్ధి కొరకు విద్యార్థుల భవిష్యత్తు కొరకు ఎనలేని సేవలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ఉపాధ్యాయులు పని చేయాలని వారు అన్నారు అనంతరం వెంకటేశ్వరరావు ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పాఠశాల ప్రధానోపాధ్యాలు శ్రీనివాస్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పుష్పలత పి ఆర్ టి యు టి ఎస్ మండల నాయకులు శ్రీనివాస్ ప్రభుదాస్ విజయ రావు తదితరులు పాల్గొన్నారు



## వేద వ్యాస పాఠశాలలో ఉగాది సంబరాలు

- పాఠశాల వ్యవస్థాపకులు జూపాక ఉమాసాగర్




**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 29:** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల వేద వ్యాస పాఠశాలలో ముందస్తు ఉగాది పండుగ వేడుకలను ఘనంగా శనివారం రోజున నిర్వహించారు విద్యార్థులు ఉగాది పచ్చడి పిండి వంటకాలు వారు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సూపర్లను ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట సదయ్య జూపాక దేవామని ఉపాధ్యాయులు ఎం శ్రీకాంత్ పి శ్వేత జి లావణ్య డి స్వాతి ఎం శ్రీలేఖ టి జ్యోత్స్న దేవి కె అర్చన బి శ్రావణి టీ కావ్య అశోక్ క్రాంతి బద్రి రమేష్ స్వరూప రాజేశ్వరి ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సెయింట్ జార్జ్ విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది సంబరాలు



**కరీంనగర్ రూరల్,మార్చి 29,ప్రజాజ్యోతి:** కరీంనగర్ లోని రేకుర్తి, విద్యానగర్,తీగలగుట్టపల్లి లలో గల సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యా సంస్థలలో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిలగా చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి హాజరయ్యారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుందని ఇది తెలుగువారి మొదటి పండుగ అన్నారు, "ఉగ" అనగా నక్షత్ర గమనం. నక్షత్రగమనానికి 'ఆది' 'ఉగాది'.అంటే సృష్టి ఆరంభమైనదినమే "ఉగాది"ఉగాది పచ్చడి"ఉగాది నాడు షడ్రుచుల సమ్మేళనం – తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి అని తెలిపారు,చిన్నారులు రంగురంగుల దుస్తులతో వచ్చి ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీలు సంగీత, సంధ్య, స్వప్న, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర సైబర్ నిందితుడిని పట్టుకున్న సైబర్ పోలీసులు

**కరీంనగర్ క్రైం,మార్చి 29,ప్రజాజ్యోతి:** ఇన్వెస్ట్మెంట్ పేరుతో డబ్బులు దోచుకున్న సైబర్ నేరస్తుడు గుజరాత్ రాష్ట్రానికి చెందిన నితిన్ దేవచంద్ భాయ్ గజేరాని ఈ నెల 27వ తేదీన కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పట్టుకున్నారు,కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ,డిఎస్పి నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పట్టణంలో నివసిస్తున్నటువంటి బాధితుడికి సోషల్ మీడియా ప్లాట్ ఫారం అయినటువంటి ఇంస్టాగ్రామ్ లో ఇన్వెస్ట్మెంట్ కు సంబంధించినటువంటి ప్రకటన చూసి ఆ ప్రకటనతో ఆకర్షితుడై జులై 2024 నుంచి ఇన్వెస్ట్మెంట్ పెట్టడం ప్రారంభించాడు. ఇన్వెస్ట్మెంట్ పెట్టే క్రమంలో మొదటగా పెట్టినటువంటి వెయ్యి రూపాయలకు రెండు వేల రూపాయల వరకు లాభం రావడం జరిగింది.బాధితుడు సైబర్ నేరగాళ్లు మొదట పంపించినటువంటి లాభాన్ని వారి యొక్క మాటలను నమ్మివారు చెప్పినటువంటి బ్యాంక్ అకౌంట్లో ఏడు దఫాలుగా లోన్ సైతం తీసుకొని దాదాపు నలభై లక్షల తొంభై వేల రూపాయల వరకు ఇన్వెస్ట్మెంట్ పెట్టడం జరిగింది,నేరస్తులకు డబ్బులు పంపించే సమయంలో మోసం చేస్తున్నారని గుర్తించలేకపోయానని, ఆ తర్వాత తాను మోసపోయానని గుర్తించి ఆగస్టు మాసంలో సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ సెంటర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు,సైబర్ క్రైమ్ కు పిటీషన్ రాగానే కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ గా విధులు నిర్వహిస్తున్నటువంటి డిఎస్పి నర్సింహారెడ్డి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లాకు వెళ్లి ఈ నెల 27వ తేదీన నిందితున్ని పట్టుకోవడం జరిగిందన్నారు.

# రూ. 100 మాయాజాలం

- లక్షన్నర ఎత్తుకెళ్లిన దొంగలు!
- జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సంచలనం సృష్టించిన చోరీ ఘటన.






**కోరుట్ల మార్చి 29 ప్రజజ్యోతి ప్రతినిధి:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఎస్బీహెచ్ బ్యాంక్ ముందట దొంగతనం జరిగిన సంఘటన కలకలం రేపింది. శ్రీహరి అనే వ్యక్తి తన సొంత అవసరాల కోసం బ్యాంక్‌లోంచి రూ. 1,50,000 డ్రా చేసుకున్నారు. అయితే, అతను బ్యాంక్ నుంచి బయటకు వచ్చి, తన డబ్బును సురక్షితంగా ఉంచుకునే లోపు, అపరిచితుల ముఠా అతనిని టార్గెట్ చేసింది.ఆ దొంగలు ఎంతో తెలివిగా మొదట రూ. 100 నోటు కింద పడేసి, శ్రీహరి దృష్టిని మళ్లించారు. డబ్బు కనిపించగానే దాన్ని తీసేందుకు శ్రీహరి ముందుకు వెళ్ళగా, ఆ సమయంలో దొంగల ముఠా అతని బ్యాగులో ఉన్న రూ. 1,50,000ను అపహరించి పారిపోయింది. ఈ సంఘటన గురించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అలాగే, స్థానికంగా ఉన్న ప్రజల నుండి సమాచారం సేకరించి దొంగల ముఠాను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇలాంటి మోసపూరిత చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ నుంచి భారీ మొత్తంలో నగదు డ్రా చేసుకున్న తర్వాత జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.వీరి ఫోటోలు సి సి కెమెరాలో రికార్డ్ అయ్యాయని కోరుట్ల పోలీసులు తెలిపారు. వీరిని ఎవరైనా గుర్తిస్తే కోరుట్ల ఎస్ఐ 8712656790 కు తెలపాలని కోరారు.

## స్వర్గీయ ఎన్టీఆర్ కు వెంటనే భారతరత్న ప్రకటించాలి

- కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్




**కోరుట్ల మార్చి 29 ప్రజాజ్యోతి ప్రతినిధి:** కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 43,వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ తెలుగుదేశం జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న బిరుదును వెంటనే ప్రకటించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి కేవలం 09 నెలల్లోనే అధికారాన్ని చేపట్టిన ఘనత మన ఎన్టీఆర్ కే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి చరిత్ర సృష్టించిన ఘనత ఎన్టీఆర్ దని, అలాగే రెండు రూపాయల కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు,మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పక్కా గృహ నిర్మాణ పథకము, మహిళా రిజర్వేషన్, బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్, అన్ని మండలిక వ్యవస్థ రద్దు, మన రాష్ట్రంలోనే ప్రతి పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించిన ఘనత మన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ హయాంలో జరిగిందని తెలిపారు. తెలుగు ప్రజలకు రాజకీయ అవగాహన కల్పించిన ఘనత కూడా ఎన్టీఆర్ దేనని, అలాగే ఇలాంటి ఎన్నో పథకాలు చిరస్థాయిగా నిలబెట్టిన ఘనత మన తెలుగుదేశం భారతరత్నపార్టీదే నని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాతర్ల విజయకుమార్, గజమానంద్, గజెల్లి రాజ గణేష్, మచ్చ లక్ష్మీపతి, రాజ నరేందర్, చలిగంటి నర్సింగం, నరసయ్య, ఎండి రఫీ, విజయ్, తెలుగు మహిళ నాయకురాలు మల్లీశ్వరి, శాంత, కళ్యాణి, శైలజ, పద్మ, రాణి, విజయలక్ష్మి , జ్యోతి, దివ్య, సోనీ, శిరీష, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**కొడిమ్యాల,మార్చి 29,(ప్రజాజ్యోతి ):** మండల అంబేద్కర్ సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మీరాజం అధ్యక్షతన సంఘం సభ్యులు సమావేశమై ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడిగా ఎలగుర్తి రవీందర్,గౌరవ అధ్యక్షుడిగా తాండ్రాల పోచయ్య, ఉపాధ్యక్షులుగా దొమకొండ నర్సయ్య, కడకుండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రామంచ లక్ష్మణ్,సహాయ కార్యదర్శిగా ఈదురి మహేష్, కంపెల్లి బాబు,అధికార ప్రతినిధిగా నెరేళ్ల మహేష్, కోశాధికారిగా కొలపురం రమేష్,ఆర్గనైజింగ్ సెక్రటరీగా పర్లపల్లి ఆనందం,కార్యవర్గ సభ్యులుగా పెంట రవి,తైదల శశి,పెంట లక్ష్మణ్,ఎడపల్లి ప్రశాంత్,దాసరి లక్ష్మణ్,కొలపురి జగన్,బొక్కెన శ్రీనివాస్ ఎన్నికయ్యారు.కార్యవర్గాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి లక్ష్మీనర్సయ్య,మాజీ ఎంపీటీసీలు సురుగు శ్రీనివాస్,పర్లపల్లి ప్రసాద్, నాయకులు పర్లపల్లి ప్రభుదాస్,సంఘం నాయకులు సత్కరించారు.

## మాతృశ్రీ హై స్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు



**మెట్ పల్లి ప్రతినిధి, మార్చి 29, ప్రజాజ్యోతి:** పట్టణంలోని మాతృశ్రీ హై స్కూల్లో శనివారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలు జరుపుకున్నారు . పిల్లలందరూ సంప్రదాయ దుస్తువుల్లో వచ్చినారు. ఇందులో భాగంగా కరెస్పాండంట్ ఇందూరి రాజకుమార్ ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యతను , ఉగాది పచ్చడి గురించి చెప్పడం జరిగింది , ఈ కార్యక్రమంలో క్సరెస్పాండంట్ ఇందూరి రాజకుమార్, ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ పద్మరాణి, ఉపాధ్యాయ బృందం, పిల్లలు అందరు కలిసి ఉగాది పండుగ ఘనంగా నిర్వహించుకున్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఒకే ఒక అప్పన్నస్వామి దేవాలయం

- రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు అప్పన్న స్వామి ఆలయాలు మాత్రమే
- ఒకటి ఆంధ్రప్రదేశ్ లోని సింహాద్రి అప్పన్న స్వామి ఆలయం
- ఇంకొకటి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లాలోని తాటిపెల్లి గ్రామంలోని అప్పన్నస్వామి ఆలయం







**జగిత్యాల జిల్లాలోని తాటిపెల్లి గ్రామంలోని గుట్టపై 9వ శతాబ్దంలో వెలిసిన అప్పన్న స్వామికి ఉగాదికి ప్రత్యేకమైన పూజలు ప్రతి సంవత్సరం ఉగాదికి నిర్వహిస్తుంటారు. తెలంగాణలో ఒకటే ఒకటి ఉన్న అప్పన్నస్వామి దేవాలయం లో ఉగాది రోజు జాతర అధిక సంఖ్యలో పాల్గొంటారు ఈ ఆలయం 9వ శతాబ్దంలో వెలిసినట్లు అంచనాలు.**

**జగిత్యాల బ్యూరో,మార్చి 29 ,ప్రజాజ్యోతి:** తెలంగాణలో ఒకే ఒక్కటి గా ఉన్న అప్పన్న దేవాలయం సంవత్సరంలో ఒక రోజు ఉగాది రోజున జాతరలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు ఈ పండగ రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకుంటారు. జగిత్యాల జిల్లాలో తాటిపల్లి గ్రామంలో వెలిసిన అప్పన్న స్వామి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అప్పన్న స్వామి ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ పట్టణం సింహాచలంలో శ్రీ అప్పన్న స్వామి తరువాత మన తెలంగాణలో జగిత్యాల జిల్లాలోని తాటిపల్లి గ్రామంలో వెలసి ఉన్న అప్పన్న స్వామి ఈ స్వామివారికి ప్రతి సంవత్సరం ఉగాది రోజున జాతర జరుగుతుంది ఈ గ్రామమునకు దక్షిణమున కేవలం 2 కి.మీ దూరంలో ఒక గుట్ట బోరుపై అద్భుతమైన చాళుక్యుల కళారీతులలో ఉన్న ప్రాచీన విగ్రహం. గుడి మాత్రం లేదు. చదునుగా నున్న ఒక చతురస్రాకారపు వేదికపై 9వ, 10వ శతాబ్దమునకు చెందిన వైష్ణవ, శైవ సంప్రదాయ విగ్రహాలు, స్థానికంగా దీనిని అప్పన్న స్వామి గుట్ట అంటారు. ఇచ్చటి ప్రదాన ఆరాధ్యదైవం అప్పన్న స్వామి అనగా నరసింహా స్వామి సింహాచలంలోని వరాహ నరసింహస్వామిని విశాఖపట్టణ ప్రాంత ప్రజలు అప్పన్నస్వామి అని పిలుస్తుంటారు. సింహాచలం తూర్పు చాళుక్యులు గాంగులు పాలించిన ప్రాంతంలో ఉంది. జగిత్యాల జిల్లా కేంద్రం నుండి 9 కిలోమీటర్లు లోపు తాటిపల్లి గ్రామం వస్తుంది. తాటిపల్లిని వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు పాలించిన ప్రాంతంలో ఉంది. తాటిపల్లి గ్రామం నుండి కాలినడకన, బైకులపైన మోటారు వాహనాల ద్వారా ఈ అప్పన్న స్వామిని చేరవచ్చును. చుట్టూ ఆకువచ్చని చెట్లతో గూడిన గుట్టలు, మనోహరమైన టేకు, తాటివనములు, దూరాన కనిపించు చెరువులు, చేనులు చెలకలు, పంటపొలాలు, పక్షుల కిలకిలారావములు ఇచటి ప్రకృతి రామణీయతను ఇనుమడింప జేస్తున్నాయి. ఇచటి ప్రకృతి అందాలు సందర్శకుల హృదిని మదిని పులకింపజేస్తాయి. జగిత్యాల ప్రాంత ప్రజలకు ఇది ఒక పర్యాటక స్థలంగా అభివృద్ధి పరుచడానికి అవకాశాలు మెండుగా చాళుక్యుల కాలపు ఇచటి విగ్రహాలు తాటిపెల్లి ఒక వేయి సంవత్సరాల పూర్వమే హరిహరాధన కేంద్రంగా శోభిల్లిన గ్రామమని, తెలుపుటకు ప్రజలు నిదర్శనములు. **నతత్వలు, విగ్రహం, ఉద్ద 1.** ముఖమును కలిగి ఉన్న ఈ నిలుపబడింది. పైనున్న కుడి హస్తమునందు శంఖు, ఎడమ చేతిలో చక్రం ఉండగా క్రింది కుడి చేయి వరద ముద్రలో నుండి ఎడమ చేయి కూర్చొని ఉన్న మోపబడింది. స్వామి ఆసనపు కాలుపై నోరు విశాలంగా తెరుచుకొని ఉండుట వలన క్రింది పెదవిపై చెక్కబడిన దంతములు ఆగబడుచున్నాయి. మకుటధారణ గల ఈ నరసింహ విగ్రహం చాళుక్య కళారీతులలో నుండుట విశేషం. ఈ ప్రాంతంలో గట్టలపైన, గుట్ట బోరులపైన, అనేక నరసింహ ఆలయాలు దర్శనమిస్తాయి. **2. వైష్ణవ విగ్రహం:** విగ్రహమునకు కుడివైపున చక్కటి ఒక వైష్ణవ సంప్రదాయ విగ్రహముంది .పై హస్తములందు శంఖు, చక్రములుండగా క్రింద ఎడమ చేతిలో గద, కుడి చేయి అభయ ముద్రలో ఉన్నాయి. ఈ విగ్రహమునకు క్రింది భాగాన ఇరువైపుల దేవేరులున్నారు. **3. గణపతి:** ఒక అద్భుతమైన మకుటములేని ద్విహస్తముల గణపతి. దీని తల ఏనుగు తలను బోలి ఉంది. ఎడమ చేతిలో దంతం లేదా స్పష్టంగా లేని ఫలం ఉండగా తొండం కుడి చేతిలో ఉన్న మొదకముల వైపు మలచబడి ఉంది. క్రింది భాగమున మూషిక వాహనం చెక్కబడింది. నాగనర్పం ఉదర బంధంగా నుండి కాళ్లకు, చేతులకు కడియములు, తలపైన హారం చెక్కబడినాయి. ఇలాంటి విగ్రహాలు వేములవాడలో దర్శనమిస్తాయి. 9వ, 10వ శతాబ్దమునకు చెందిన ఈ గణపతి విగ్రహం చూడముచ్చటగా ఉంటుంది. **4. బైరవుడు:** ఇది శైవ సంప్రదాయపు చతుర్భుజ నగ్న విగ్రహం, పైనున్న ఎడమ చేతిలో డమరుకము, కుడి చేతిలో త్రిశూలం, క్రింది కుడి చేతిలో ఖడ్గం,ఎడమ చేతిలో ఖండింపబడిన శిరస్సు ఉన్నాయి. తల వెంట్రుకలు విరియబోసికొని సికొని ఉన్నాయి. పరమశివుని వేరొక రూపమే ఈ బైరవ విగ్రహం.

## ధర్మపురి లో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవవేడుకలు



**ధర్మపురి, మార్చి 29, ప్రజాజ్యోతి:** శనివారం రోజున జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజక వర్గ కేంద్రంలోని నంది కూడలిలో తెలుగువారి ఆరాధ్య దైవం మాజీ ముఖ్యమంత్రి స్థాపించిన తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ వుప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి టెంకాయ కొట్టి నివాళులు అర్పించి పార్టీ పథాకావిష్కరణ గావించినారు. తదుపరి కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తిర్మన్ దాస్ శ్రీనివాస్, దూడ గంగారాం, దూడ జైపాల్, జిల్లపెల్లి భీమయ్య, మూడపెల్లి రాజయ్య, సింహరాజు లక్ష్మీనారాయణ, వొజ్జల పుల్లయ్య శాస్త్రి, డాక్టర్ సిరికొండ రాజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



**కొడిమ్యాల,మార్చి 29,(ప్రజాజ్యోతి ):** ముస్లింలు అత్యంత భక్తి శ్రద్దల మధ్య రంజాన్ వేడుకలను జరుపుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు అత్యంత పవిత్ర మాసం అయిన రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకోవడమే కాకుండా కఠిన ఉపవాస దీక్షలు పాటించడం గొప్ప విషయమన్నారు.రాష్ట్రంలో కులమతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలివేరి నారాయణ,ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ కరుణాకర్,నాయకులు పిడుగు ప్రభాకర్ రెడ్డి,జామల్పూరి రాజేందర్,చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ని కలిసిన నూతనంగా నియామకమైన జగిత్యాల బస్ డిపో మేనేజర్ కల్పన



**జగిత్యాల టౌన్,మార్చి 29, (ప్రజాజ్యోతి):** జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన కల్పన శనివారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నీ జగిత్యాలలోని కలెక్టర్ కార్యాలయంలో కలిసారు.

## పదవి విరమణ పొందిన పోలీసులకు సత్కారం

- పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతం
- పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి



**జగిత్యాల క్రైం,మార్చి 29, (ప్రజాజ్యోతి):** విధి నిరవ్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందిన ఎస్.ఐ మన్సూర్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ గంగరాజం లని శాలువా,పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అదనపు ఎస్పీ శ్రీ భీమ్ రావు అందజేసినారు. శనివారం రోజున జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన అదనపు ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. సుమారు 40 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఎస్.ఐ మన్సూర్ ఖాన్, 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన హెడ్ కానిస్టేబుల్ గంగరాజం లను సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణు, పదవి విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొలాస ఫిల్టర్ బెడ్ మరమ్మతుల పనులను పరిశీలించారు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల బ్యూరో,మార్చి29,(ప్రజాజ్యోతి)** జగిత్యాల రూరల్ మండలంలో పొలాస గ్రామం లోని శ్రీ పాలేస్తేశ్వర స్వామివారి ని దర్శించుకొని ఫిల్టర్ బెడ్ పనులను పరిశీలించారుజగిత్యాల రూరల్ మండలం పోలాస ఫిల్టర్ బెడ్ వినియోగం లోకి తీసుకువచ్చే సమయంలోనే రాష్ట్రం ఏర్పడడం నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ వాటర్ సప్లై స్కీం ద్వారా రాష్ట్రం అంత నీరు అందించాలని సంకల్పించడం దానితో నిర్మాణం పూర్తి చేయబడి ఉన్నటువంటి యొక్క సి.పి.డబ్ల్యూ. ఎస్ స్కీం అన్ని కూడా వినియోగం నిలిపివేశారు జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి పొలాస ,బీర్పూర్ ,రాయికల్ ఇవన్నీటిని కూడా ఆపరేషన్ వినియోగాన్ని నిలిపివేసి భగీరథ అని సరఫరా పొందడం దాని ద్వారానే త్రాగునీటి సరఫరా చేయాలని సంకల్పించారురాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తదుపరి పార్లమెంట్ ఎన్నికల ముందు సి.పి డబ్ల్యూ. ఎస్ స్కీంకి సంబంధించి మన జగిత్యాల నియోజకవర్గం 3 పొలాస , బీర్పూర్ రాయికల్ ఈ మూడు స్కీమ్స్ వినియోగం లేక ఉండడంతోని అవి మళ్లీ రెస్టరేషన్ కావడానికి మరమ్మతులకు నిదులు అవసరమని మరమ్మత్తులతో పాటుగా గతంలో క్లోరినేషన్ కేవలం లిక్విడ్ క్లోరినేషన్ ఉండే దానిని గ్యాస్ క్లోరినేషన్ గా మార్చడం జరిగింది గ్యాస్ క్లోరినేషన్ ద్వారా నీటిని శుద్ధి చేయాలని మరియు మరమ్మతులు అంచనా వేస్తే 3 స్కీమ్స్ కి సంబంధించి 14 కోట్లు అయింది ఈ అంచనాని నేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వారు జగిత్యాల నియోజకవర్గంలో భవిష్యత్తు లో త్రాగునీటికి సమస్య నివారణకు 14 కోట్ల రూపాయలు మంజూరు చేశారు 14 కోట్లలో 5 కోట్ల 30 లక్షల రూపాయలు పొలాస ఫిల్టర్ బెడ్ క్లోరినేషన్ పైపు లైన్ లింక్ పైప్ లైన్ మరియు ఇతర మరమ్మతులకు కేటయించడం జరిగింది అని అన్నారు పూర్తిగా కల్లెడ గ్రామం వరకు నీటి సరఫరా జరిగే విదంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు జగిత్యాల నియోజకవర్గం లోని ఫిల్టర్ బెడ్ పనుల మరమ్మత్తులకు 14 కోట్ల నిధులు కేటాయించినందుకు ప్రభుత్వం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన హర్షం వ్యక్తం చేశారు పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జున్ను రాజేందర్ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రాముల గంగాధర్ మాజీ సర్పంచ్ చంద రాధకిషన్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ అధ్యక్షుడు స్వామి రెడ్డి , విజయ్ , సందీప్ , మధు , కాంగ్రెస్ నాయకులు వేణు గ్రామ శాఖ అధ్యక్షుడు మిల్కురి శంకరయ్య దర్నెని వెంకటేష్ మాజీ ఉప సర్పంచ్ మైనార్టీ నాయకులు షాహీద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ మరియు వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## వాణీనగర్ శ్రీ రామకృష్ణ ప్రైమ్ స్కూల్ లో ముందస్తు ఉగాదిసంబరాలు



**జగిత్యాల టౌన్, మార్చి29, ప్రజాజ్యోతి** జగిత్యాల పట్టణంలోనిస్థానిక రామకృష్ణ విద్యా సంస్థల వారి ఎస్ ఆర్ కే ప్రైమ్ స్కూల్ వాణి నగర్ లో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ విశ్వావసు తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది రోజు ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ షడ్రుచులతో కూడిన పచ్చడిని తయారుచేసి రకరకాల పిండి వంటకాలతో సకుటుంబ సమేతంగా నూతన పంచాంగ శ్రావణిని ఆచరిస్తూ జరుపుకోవడం ఈ ఉగాది పండుగ ప్రత్యేకత పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు నేర్పిస్తూ మన సాంస్కృతి సాంప్రదాయాలను మరియు పండగలను జరుపుకునే భావాన్ని వారికి నేర్పించాలన్న ఒక సదుద్దేశంతో ముందస్తుగా ఉగాది సంబరాలను నిర్వహించడమే కాకుండా ప్రత్యేకంగా పచ్చడిలో కలిపే తీపి, పులుపు, ఉప్పు, చేదు ,కారం ,వగరు కలిపి ప్రత్యేకంగా ఉగాది పచ్చడిని తయారుచేసి పచ్చడిలో కలిపే తీపి ఆనందానికి సంకేతం, ఉప్పు జీవితంలో ఉత్సాహం రుచికి సంకేతం ,చేదు బాధను కలిగించే అనుభవాలకు సంకేతం , పులుపు నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులకు సంకేతం మరియు కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని జీవితంలో కష్టసుఖాలకు ఓర్చుకొని ఒక సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఒక నూతన అధ్యాయనమే ఈ ఉగాది పచ్చడి ప్రత్యేకత అని తెలుపు తూ ప్రత్యేకంగా గౌరవ పోషకులకు విద్యార్థిని విద్యార్థులకు అధ్యాపకులకు మరియు శ్రేయోభిలాషులకు మిత్రులకు ముందస్తు తెలుగు నూతన శ్రీ విశ్వా వసు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ యాద రామకృష్ణ ,రామకృష్ణ కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్ రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ కొక్కుల రాజేందర్ మరియు ఎన్ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపు మునిందర్ రెడ్డి గారు ఎస్ ఆర్ కే ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపల్ గోపు దీపిక విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఇరు గ్రామాల మధ్య సరిహద్దు చిచ్చు

- పరిధిబోర్డుల స్థానమార్పిడి
- భూ వివాదంలో ఘర్షణ.
- ఇరు గ్రామాలకి న్యాయం చేస్తాం
- ఆర్డివో శ్రీనివాస్



**మల్లాపూర్ మార్చ్ 29,ప్రజాజ్యోతి :** భూ వివాదాల నేపథ్యంలో ఇరు గ్రామాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలంలోని నడికూడ, మోగిలిపేట గ్రామాల సరిహద్దు భూమిలో మోగిలిపేట గ్రామస్తులు వరి ధాన్యం విక్రహించేందుకు స్థలానికి చదను చేశారు. ఈ క్రమంలో నడికూడ గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన భూమిని మోగిలిపేట గ్రామస్తులు ఎలా చదను చేస్తారని ఆగ్రహించి శనివారం రోడ్డుపై బైఠాయించారు. అలాగే మోగిలిపేట గ్రామస్తులు భూమి తమకు చెందినదని వాళ్ళు సైతం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంఘటన పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు గ్రామస్థులతో ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెల 16 తేదీన సర్వే అధికారులతో సర్వే చేసి ఇరు గ్రామాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.16 తేదీ వరకు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకూడదన్నారు.ఇక్కడ తహసీల్దార్ వీర్ సింగ్,డిఎస్పీ రాములు,మెట్ పల్లి సిఐ అనిల్ కుమార్,కోరుట్ల సిఐ సురేష్ బాబు,ఎస్సైలు రాజు,కిరణ్ కుమార్, నవీన్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది వైశిష్ట్యం

- భారతీయ సంస్కృతి ఉగాది పండగ గొప్పది
- ఉగాది పండుగ తోనే తెలుగు సంవత్సరం ప్రారంభం



**జగిత్యాల మార్చి 29 ప్రజా జ్యోతి:** మన భారతీయ సంస్కృతి, నాగరికతలు ఎంతో విశిష్టమైనవి.ఇంకా నిలిచి ఉన్న ప్రాచీన నాగరికతల్లో భారతీయ నాగరికత ప్రముఖ్యమైనది.విద్య,వ్యాపారం, ఆధ్యాత్మికం, కుటుంబ జీవనం,రాజ్య పాలన,ఆర్థిక వ్యవహారాలు,ఖగోలం, గణితం,పరిశోధన...ఇలా అన్ని రంగాలలో కూడా మన పూర్వీకులు ఎంతో విభిన్నమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.ఒక విధంగా చెప్పాలంటే ప్రపంచ నాగరిక చరిత్రలను పరిశీలిస్తే భారతీయ నాగరికత అందులో సగ భాగానికి పైగా ఆక్రమిస్తుంది.అన్ని రంగాలలోనూ ప్రపంచానికే మార్గ దర్శకులుగా నిలిచిపోయారు.

"'"చైత్రమాసి జగత్ బ్రహ్మా ససర్జ ప్రథమే అహని!
వత్సరాదౌ వసంతాదౌ రవిరాద్యే తథైవచ""

విధాత యైన ఆ బ్రహ్మదేవుడు తన సృష్టి కార్యక్రమాన్ని ,–60సంవత్సరాల్లోని మొదటిదైన ప్రభవ నామ సంవత్సరం, పన్నెండు మాసాల్లో మొదటి మాసమైన చైత్రమాసం, ఆరు ఋతువులలో మొదటిదైన వసంత ఋతువు, ఏడు వారాల్లో మొదటిదైన ఆదివారం,ముప్పై తిథుల్లో మొదటిదైన పాడ్యమి తిథి, ఇలా అన్నీ మొదటివే ఒకేసారి కలిసిన సందర్భంలో ప్రారంభించాడు.ఈ సృష్టి అలా ప్రారంభమయినదన్నమాట.

చైత్రశుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగను జరుపుకుంటారు అని చెప్పుకున్నాం కదా,

ఉగాది పండుగను ప్రకృతి పచ్చదనాల పండుగగా జరుపుకుంటారు,ప్రభవతో మొదలై అక్షయ నామ సంవత్సరం తో ఒక ఆవృతం పూర్తవుతుంది.అంటే అరవై సంవత్సరాలు అన్నమాట.

వసంత ఋతువులో వచ్చే ఉగాది ప్రకృతిలో పచ్చదనం నింపడానికి వచ్చిందా అన్నట్లుగా ఉగాది పర్వదినాన ప్రకృతి అంతా పచ్చదనంతో కళకళలాడుతూ ఉంటుంది.

ఉగాదితో మన తెలుగు వారికి నూతన సంవత్సరం ఆరంభమౌతుంది .ఈరోజున గృహాలన్నీ మామిడి తోరణాలతో శోభాయమానంగా ఉంటాయి.

ఉగాది రోజున ఉగాది పచ్చడి తప్పక తినాలి, చింతపండు రసం తీసి అందులో కొత్త బెల్లం, వేపపువ్వు, మామిడి ముక్కలు, అరటి పండ్లు, చెరుకు ముక్కలు, వేసి ఉగాది పచ్చడి తయారు చేస్తారు.ఉగాది షడ్రుచుల సమ్మేళనం.

ఈ చైత్రమాస శుద్ధ పాడ్యమిని"కల్పాది "అని కూడా అంటారు.అంటే కల్పానికి ప్రారంభమనీ,మన హిందువుల సంకల్ప మంత్రాలకు కాలాన్నిలెక్కించే ప్రమాణాన్ని కల్పం అంటారు.

వేదం యొక్క గమనాన్ని,ఆసమయాన్ని తెలియజేసే ఈపండుగ పేరు "యుగాది "అంటే యుగానికి ఆరంభం.సంస్కృత పదమైన ఈ యుగాదికి తెలుగు పదం ఉగాది !మన తెలుగు భాషకు ఇతర దేశ భాషలకు మూలం సంస్కృత భాషే !

ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేస్తారు.సంవత్సరం అంతా వారివారి జాతకాలు ఎలా ఉంటాయో ముఖ్యంగా ఆదాయ,వ్యయాల గురించి రాజపూజ్యం,అవమానాల గురించి అడిగి తెలుసుకుంటారు.పెద్దవారికి నమస్కరించి వారినుంచి ఆశీర్వచనం తీసుకుంటారు.

"చైత్రశుద్ధ పాడ్యమి రోజునే ఉగాది ఎందుకు జరుపుకోవాలి "

ఈరోజూతో ద్వాపరయుగం పూర్తి అయి కలియుగం ప్రారంభమైనదట, కృష్ణావతారం ముగిసిన రోజే కలిపురుషుడు ప్రవేశించిన రోజు కాబట్టి ఆరోజున ఉగాది జరుపుకుంటారు.

శ్రీరామచంద్రుడు త్రేతాయుగంలో ఉగాది రోజున పట్టాభిషిక్తుడైనాడు . అలాగే శాలివాహన, విక్రమార్క చక్రవర్తులు కూడా ఆ రోజునే తమతమ రాజ్యాలను స్వీకరించారట.దీనిని బట్టి చూస్తే ఉగాది అన్ని శుభాల్ని వెంటబెట్టుకొని వస్తుందన్న మాట.

ఉగాది పచ్చడిని ముందుగా దేవునికి నైవేద్యంగా పెట్టి తరువాత ఖాళీ కడుపుతో మనం దీనిని ప్రసాదంగా తీసుకోవాలి.

ఇది ఆరోగ్యకరమైన ఔషధం.

ఆధ్యాత్మికంగా భగవంతునికి నివేదన.

మానసికంగా ––సుఖదు:కాలను రెండింటినీ సమంగా అనుభవించగలిగే ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించేది.

ఇన్ని శుభాలనిచ్చేది కాబట్టి ఈ పచ్చడి ప్రసాదమైంది.

మరో ముఖ్యవిశేషమంటే ఈరోజున చలివేంద్రం ఏర్పాటు చేయాలి.ఎండలో వచ్చినవారికి ఆ చలి వేంద్రాలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఇంకా చివరగా దానం చేయవలసిన కార్యక్రమం ఒకటున్నది.ప్రస్తుతం దీనిని ఎవరూ పాటించటం లేదు.అదే పూర్ణకుంభ దానం,"లేదా ధర్మ కుంభ దానం అంటారు.

ఈ దానం చేయదలచిన వాళ్లు కుదిరితే రాగిచెంబూ, కుదరకపోతే పంచలోహాల చెంబూ,అదీ కుదరకపోతే మట్టితో చేసిన కొత్త కుండను తీసుకొని దానిని ఉన్నంతలో అలంకరించి, పూజించాలి, అదే కలశ పూజ ,!ఏ శుభకార్యానికైనా ముందుగా ఈ కలశ పూజ తప్పనిసరి.

కలశపూజానంతరం ఆ కుంభాన్ని గురువుగారికి కానీ,పూజచేయించిన పురోహితునికి కానీ భక్తి పూర్వకంగా దానం చేయాలి.శక్తి ఉంటే దాంతోపాటు కొత్త వస్త్రాలు, దక్షిణ కూడా సమర్పించుకోవాలి.

ఉగాది నాడు ఏదైనా ఆరంభిస్తే దిగ్విజయంగా ఆపని పూర్తవుతుందన్న విశ్వాసం మనలో ఉంది కాబట్టి ఆరోజున మీరు ప్రారంభించాలనుకున్న కార్యాలు ఏవైనా ఉంటే వాటిని మొదలు పెట్టి దిగ్విజయంగా పూర్తి చేయండి.

,"చైత్రమాసం ఎండలతో పాటు , ఎన్నో పండుగలతో కలగలిసిన ఆధ్యాత్మిక, పౌరాణిక, విశిష్టతలు కలగలిసిన మాసమే ఈ చైత్ర మాసం".

**డాక్టర్ గుండి శ్రీనివాస్ శర్మ ధర్మపురి.**
ఎం ఎ,.(తెలుగు ),ఎం ఎ.,,(సంస్కృతం,)ఎం ఫీల్,(సంస్కృతం,)పి హెచ్ డి (సంస్కృతం)
9848986730.

# ఉగాది పండగ విశిష్టత



**జగిత్యాల,మార్చి 29, (ప్రజాజ్యోతి):** ఉగాది పండుగ యొక్క విశిష్టతను కూర్మాచలం నరేష్ వివరిస్తూ ఈ ఉగాది అనేది తెలుగు నూతన సంవత్సరాది ప్రారంభ పండగ ఉగాది. ఈ పండగ జరుపుకోని తెలుగు వారు ఉండరు. ఈ ఉగాది ఒక్క తెలుగువారే కాకుండా దక్షినాది రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర ప్రజలు జరుపుకుంటారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉపయోగించే చంద్రమాన పంచాంగం ప్రకారం మొదటి నెల చైత్రమాసం. చైత్రమాసం మొదటి రోజైన చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాదిని జరుపుకుంటారు.కొత్త సంవత్సరాదైన ఉగాది నుండే వసంతకాలం మొదలవుతుంది. వాతావరణం ఈ రోజు నుండి ప్రత్యేక అందాలను సంతరించుకొంటుంది. ఈ సమయంలో వృక్షాలు కొత్త ఆకులు, పూలతో చూపరులను ఆహ్లాదపరుస్తాయి. ఉగాది లేదా యుగాది అనే పదాలు సంస్కృతం నుండి వచ్చినవి. "యుగ" అనగా కాలమని "ఆది" అంటే ఆరంభం అని అర్ధం. తెలుగువారు "ఉగాది" అని కన్నడిగులు "యుగాది" అని మరాఠీలు "గుడి పాడ్వా" గా ఈ పండగని జరుపుకుంటారు. ప్రవాసులు తమ తమ దేశాల్లో "ఉగాది"ని ఆచారాలకనుగుణంగా నిబద్ధతతో జరుపుకొని విదేశీయుల దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఉగాది రోజున కొత్త పనులు, నిర్ణయాలు ప్రారంభించే సమయమని తెలుగు ప్రజలు నమ్ముతారు. అంతే కాకుండా ఈరోజు కొత్త వస్తువులను కూడా కొని ప్రారంభించటం ఆనవాయితీ

### ఉగాది చరిత్ర కోణం

బ్రహ్మ విశ్వ సృష్టిని ప్రారంభించిన రోజునే ఉగాది పండగ అని పురాణాల ప్రవచనం. ఈ ఉగాది పండగ చారిత్రిక వివరాలను కూడా కలిగి ఉంది. ఉగాది పండగ శాలివాహనుల కాలం నుండి ఆచరణలో ఉన్నాదని చరిత్రకారుల మాట. అప్పటి శాలివాహనుల రాజు "గౌతమీపుత్ర శాతకర్ణి"గా పేర్గాంచిన రాజా శాలివాహన ఉగాది పండగకు శ్రీకారం చుట్టారు. చాంద్రమాన కాలం ప్రకారం ఒక యుగానికి 60 సంవత్సరాలు. ప్రతి సంవత్సరం వచ్చే చైత్ర శుద్ధ పాడ్యమి నాడు జరుపుకొనే ఉగాదికి ఒక పేరు చొప్పున 60 పేర్లు పెట్టినట్లు చరిత్ర చెపుతోంది. ఈ 60 ఉగాది నామ సంవత్సరాల తరువాత వచ్చే ఉగాదికి తొలి సంవత్సరపు ఉగాది పేరుతొ తిరిగి ప్రారంభం అవుతుంది.

### "ఉగాది" ఆచరణ విధానం

ఉగాది పర్వాచరణ విధానాన్ని 'దర్మసింధు' కారుడు 'పంచవిధుల సమన్వితం'గా ఇలా సూచించియున్నాడు. తైలాభ్యంగనం, నూతన సంవత్సరాది స్తోత్రం, నింబకుసుమ భక్షణం (ఉగాది పచ్చడి సేవనం), ధ్వజారోహణం (పూర్ణకుంభదానం), పంచాంగ శ్రవణం.మున్నగు 'పంచకృత్య నిర్వహణ' గావించవలెనని వ్రతగంధ నిర్దేశితం.

**(1) తైలాభ్యంగనం**

తైలాభ్యంగనం అంటే నువ్వుల నూనెతో తలంటి పోసుకోవడం ప్రధమ విధి. ఉగాది వంటి శుభ దినాలలో సూర్యోదయానికి పూర్వమే మహాలక్ష్మి నూనెలోను, గంగాదేవి నీటిలోను, ఆవహించి వుండునని ఆర్యోక్తి. కావున నూనెతో తలంటుకుని అభ్యంగన స్నానం చేసిన లక్ష్మి , గంగా దేవుల అనుగ్రహాన్ని పొందగలుగుతారు. అభ్యంగంకారయోన్నిత్యం సర్వేష్వంగేషు పుష్టినం (అభ్యంగన స్నానం అన్ని అవయవాలౌ పుష్టిదాయకం) అని ఆయుర్వేదోక్తి దృష్ట్యాఅభ్యంగనం ఆరోగ్యం కూడా. ఆరోగ్యరీత్యా ఆధ్యాత్మికరీత్యా తైలభ్యంగనానికీ రీతిగా విశేష ప్రాధాన్యమీయబడినది

**(2) నూతన సంవత్సర స్తోత్రం**

అభ్యంగ స్నానానంతరం సూర్యునికి, ఆర్ఘ్యదీ పధూపాధి,పుణ్యకాలానుష్టానం ఆచరించిన పిదప మామిడి ఆకులతోరణాలతో, పూలతోరణాలతో దేవుని గదిలో మంటపాన్ని నిర్మించి, అందు నూతన సంవత్సర పంచాంగాన్ని, సంవత్సరాది దేవతను, ఇష్టదేవతారాధనతో బాటు పూజించి ఉగాది ప్రసాదాన్ని (ఉగాది పచ్చడి) నివేదించవలెను.

**(3) ఉగాడి పచ్చడి సేవనం**

ఉగాది నాటి ఆచారాలలో ఉగాది పచ్చడి సేపనం అత్యంత ప్రధానమైనది. వేపపూత, కొత్త చింతపండు, బెల్లం లేక పంచదార లేక చెరకు ముక్కలు, నేయి, ఉప్పు, మిరియాలు, షడచులు మిళితమైన రసాయనాన్నే ఉగాడి పచ్చడి అంటాం! అబ్దాదౌ నింబకుసుమం శర్కరామ్ల ఘృతైర్యుతమ్ భక్షితం పూర్వయామేతు తద్వర్షే సౌఖ్య దాయకమ్ అని ధర్మ సింధు గ్రంధం చెబుతున్నది. ఈ ఉగాడి పచ్చడిని ఇంట్లో అందరూ పరగడుపున సేవించవలెను. ఉగాడి నాడు ఉగాడి పచ్చడి సేవించడం వల్ల సంవత్సరమంతా సౌఖ్యదాయకమని ఈ శ్లోక భావం, పలురుచుల మేళవింపు అయిన ఉగాడి పచ్చడి కేవలం రుచికరమే కాదు ప్రభోదాత్మకం కూడా! తీపి వెనుక చేదు, పులుపు ఇలా పలురుచులకు జీవితాన కష్టాలు, తదితర అనుభూతులు, ప్రతీకలే అనే నగ్న సత్యాన్ని చాటుతూ సుఖాలకు పొంగకు, దు:ఖానికి క్రుంగకు, సుఖదు:ఖాలను సమభావంతో స్వీకరించు అనే ప్రగతిశీల సందేశాన్నిస్తుందీ ఉగాడి పచ్చడి. అంతేగాక ఈ పచ్చడి సేవన ఫలంగా వివిధ అనారోగ్య స్థితులు పరిహరించబడి, రోగశాంతి, ఆరోగ్యపుష్టి చేకూరుట గమనార్హం.

**(4) పూర్ణ కుంభదానం**

ఉగాదినాడు ఇంద్రధ్వజ, బ్రహ్మధ్వజ ప్రతిష్టపన ఆచారంగా ఉన్నది. ఒక పట్టు వస్త్రాన్ని ఒక వెదురు గడకు పతాకం వలె కట్టి దానిపై నారికేళముంచబడిన కలశాన్ని వుంచి, ఆ కర్రకు మామిడి ఆకులు, నింబ పత్రాలు, పూల తోరణాలు కట్టి ఇంటి ప్రాంగణంలో ప్రతిష్టించి ఆరాధించడం ధ్వజావరోహణం. ఇటీవల ఈ ఆచారం చాలావరకు కనుమరుగై దాని స్థానంలో కలశ స్థాపన, పూర్ణకుంభదానం ఆచరణలోకి వచ్చింది. యధాశక్తి రాగి, వెండి, పంచలోహం లేదా మట్టితో చేసిన కొత్తకుండను కలశంలా చేసి రంగులతో అలంకరించి అందులో పంచపల్లవాలు (మామిడి, అశోక, నేరేడు, మోదుగ మరియు వేప చిగుళ్ళు) సుగంధ చందనం కలిపి పుష్పాక్షతలు వేసి ఆవాహనం చేసి, పూజించి కలశానికి ఒక నూతన వస్త్రాన్ని చుట్టి కలశంపై పసుపు కుంకుమ చందనం, పసుపు దారాలతో అలంకరించిన కొబ్బరి బోండాం నుంచి పూజించి పురోహితునకుగాని, గురుతుల్యులకుగానీ, పూర్ణకుంభదానమిచ్చి వారి ఆశీస్సులు పొందడం వల్ల సంవత్సరం పొడవునా విశేష ఫలితం లభిస్తుందని ప్రతీతి.

**(5) పంచాంగ శ్రవణం**



తిధి, వార, నక్షత్ర, యోగ, కరణములనెడి పంచ అంగాల సమన్వితం పం చాంగం. ఉగాది నాడు దేవాల యంలోగాని, గ్రామ కూడలి ప్రదేశాల్లోగాని, పండితుల, సిద్ధాం తుల సమ క్షంలో కందాయఫలాలు స్థూ లంగా తెలుసుకొని తదనుగుణంగా సంవత్సరం పొడవునా నడచుకొనుటకు నాడే అంకురార్పణం గావించవలెనని చెప్పబడియున్నది. ఉగాదినాటి పంచాంగ శ్రవణం వల్ల గంగానదిలో స్నానం చేస్తే అభించేటంత ఫలితం లభిస్తుంది.

ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారికి సూర్యుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రసమాన వైభవాన్ని, కుజుడు శుభాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు కులాధిక్యతను కలుగచేస్తారని చెప్పబడినది.'బ్రహ్మ ప్రళయం' పూర్తి అయిన తరువాత తిరిగి సృష్టి ప్రారంభించు సమయాన్ని 'బ్రహ్మ కల్పం' అంటారు.

ఇలా ప్రతికల్పంలోను మొదటవచ్చే యుగాదిని యుగానికి ఆదిగా, ప్రారంభ సమయమును ఉగాది అని వ్యవహరిస్తూ ఉంటారు. అలాగునే ఈ 'ఉగాది' పర్వదినం మనకు చైత్రమాసంలో ప్రారంభమవడం వల్ల ఆరోజు నుండి మన తెలుగు సంవత్సర ఆరంభ దినంగా పరిగణించి, లెక్కించుటకు వీలుగా ఉండేందుకే ఉగాది పండుగను మనకు ఋషి పుంగవులు ఏర్పాటు చేశారు. లక్ష్మీప్రాప్తికి, విజయ సాధనకు చైతన్యం కావాలి. జీవునకు చైతన్యం కలిగించేది కాలం. ముఖ్యంగా ఉగాది సమయం గంటలు, రోజులు, వారాలు, పక్షాలు, నెలలు, ఋతువులు, ప్రాణులు కాలస్వరూపమైన సంవత్సరంలో నివసిస్తున్నాయి.

**ఉగాది ప్రత్యేక వంటకాలు**

రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లలో "బొబ్బట్లు", "పూర్ణం బూరెలు" విధిగా చేస్తారు.ఈ రెండు వంటకాలు తెలుగు ప్రజల పూజల్లో "పవిత్ర వంటకాలు"గా నిలుస్తాయి. తెలుగు ప్రజలు ఈ రెండు వంటకాలను తాజా ఆవు నెయ్యిని జోడించి ఆరగిస్తారు.

**ఉగాది పచ్చడి విశిష్టత**

"ఉగాది"నాడు చేసుకొనే పచ్చడి ఎంతో ప్రాముఖ్యమైనది. షడ్రుచుల పచ్చడిని ఆరగించడం వెనుక జీవితసారం గోచరిస్తుంది. ఈ పచ్చడిలో మధురం (తీపి), ఆమ్లం (పులుపు), కటు (కారం), కషాయ (వగరు), లవణం (ఉప్పు), తిక్త (చేదు) రుచులు మిళితమై ఉంటాయి. ఈ ఆరు రుచులు జీవతంలో ఎదుర య్యే సంతోషం(తీపి), దుఃఖం(చేదు), కోపం (కారం), భయం (ఉప్పు), విసుగు (చింత పండు), ఆశ్చర్యం /సంభ్రమం (మామిడి) సమ్మేళనం. అంతే కాకుండా ఈ ఆరు రుచులు ఆరు రకాలైన లాభాలను కలుగచేస్తున్నవి. కొత్త బెల్లం ఆకలిని కలిగిస్తుంది. చింతపండు కఫ వాతాల్ని పోగొడుతుంది. పచ్చిమిరపకాయలు శరీరంలో క్రిముల్ని నాశనం చేస్తుంది. మామిడి_ముక్క జీర్ణ ప్రక్రియకు తోడ్పడుతుంది. వేప_పువ్వు చేసే మేలు పలు విధాలుగా ఉంటుంది.

### ఉగాది పంచాంగ శ్రవణం

ఈ రోజు యుక్త వయస్కులు, నడివయస్కులు, వృద్ధులు, రాజకీయ నాయకులు, వృత్తి నిపుణులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, రైతులు ఎంతో శ్రద్ధగా వారి వారి స్థాయిల్లో పంచాంగ శ్రవణం చేయటం పరిపాటి. వారి రాశి ఫలాలను నూతన సంవత్సరాదిన ఎలా ఉండబోతుందో మిక్కిలి ఆశక్తితో జ్యోతిష్య పండితులు చేసే పంచాంగ పఠనాన్ని ఎంతో జాగ్రత్తగా ఆశక్తితో వింటారు.

## రాజీవ్ యువ వికాస పథకం గడువు పొడిగించాలని బిజెపి పట్టణ అధ్యక్షుల డిమాండ్



**ధర్మపురి రూరల్ (మార్చి 29) ప్రజాజ్యోతి:** జగిత్యాల జిల్లాలోని ధర్మపురి తాహాసిల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ, నివాస,ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దాని దృష్టిలో పెట్టుకొని ఈరోజు దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధ్రువీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేయాలని, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఈరోజు తాహాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయంలో కుల,ఆదాయ,నివాస ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధ్రువీకరణ పత్రాలు ఆమోదం కావడానికి 20 నుంచి నెలరోజులు పడుతున్నట్లు దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. రోజులు గడుస్తున్నా ఆమోదం కాకపోవడంతో దరఖాస్తుదారులు మీ సేవల చుట్టూ తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సింది పోయి దరఖాస్తుదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ వ్యవస్థ ఉన్నప్పటికీ దరఖాస్తుదారులు ఆర్ ఐ ల RI సంతకాల కోసం,మరియు విచారణ పేరుతో ఆమోదం ఆలస్యం కావడంతో వాటి ధ్రువీకరణ కోసం తహసిల్దార్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్నారు. సంవత్సరాల తరబడి వ్యవస్థ ఇలాగే నడుస్తున్నప్పటికీ వ్యవస్థను సరి చేయడంలేదు. ఆన్లైన్ చేసిన దరఖాస్తు పత్రాలు, ఆర్ ఐల సంతకాల కోసం వచ్చిన దరఖాస్తులు ఆఫీసులో దొరుకక పోవడంతో సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం పెట్టిన రాజీవ్ యువ వికాస పథకం కోసం కుల ధ్రువీకరణ పత్రల కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. రోజులు గడుస్తున్నా...ఆమోదం కాకపోవడం దరఖాస్తు గడువు ఈనెల 5 వరకు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి ఆలస్యం కాకుండా వెంటనే ఆమోదం తెలపాల్సిందిగా అలాగే ఇట్టి రాజీవ్ యువ వికాస పథకం మరో 10 రోజులు గడువు పెంచాలని, ధర్మపురి పట్టణ మండల ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్, బెజ్జారపు లవన్, మాధవ్, మల్లేష్, శ్రీధర్, నవీన్, అనిల్, మధుసూదన్, హరీష్, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆర్జీ1 కన్వీనర్ గా ఆరేపల్లి



**గోదావరిఖని , మార్చి 29 (ప్రజా జ్యోతి) :** సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ 140/2018 ఆర్జీవన్ కన్వీనర్ గా ఆరేపల్లి హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏరియా జిఎం తో జరిగిన సమావేశంలో సంఘం జనరల్ సెక్రెటరీ ఆంథోటి నాగేశ్వర్ రావు కమిటీని పరిచయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల హక్కుల రక్షణకు ఎల్లప్పుడూ సభ్యులు కట్టుబడి పని చేయాలని సూచించారు.హక్కుల సాధనలో సంఘం సమస్యలు పరిష్కారంలో జిఎం సహకరించాలని కోరారు.అనంతరం హరీష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అధ్యక్షులు ఎల్కతుర్తి రాజేశ్వర్,ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు సెంట్రల్ కమిటీ సభ్యులు ఇరువురాల శ్రీనివాస్ ఏరియా లైసెన్స్ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు నాయకులు ఈర్ల రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం శంకర్, రాకేష్, రాజేష్, సంతోష్, శివ, బాలకిషన్, శరత్, సుభాష్, కుమార్ రాజా పాల్గొన్నారు.